ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య జిల్లా వార్తలు
5
శుక్రవారం 15 నవంబరు 2024

డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయండి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం శాసనసభలో వైద్య శాఖకు సంబంధించిన పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ పీలేరు, వాల్మీకిపురం, కలికిరిలో మూడు వంద పడకల ఆసుపత్రులను మంజూరు చేస్తూ ప్రభుత్వం 2013 జీవోలు జారీ చేసిందని ఆయన గుర్తు చేశారు. పీలేరులో వంద పడకల ఆసుపత్రి ఏర్పడిందని, కలికిరి, వాల్మీకిపురంలో గత ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని చెప్పారు. కలికిరిలో సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ వంటి పారా మిలటరీ స్థావరాలు, సైనిక పాఠశాల, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు అనేక రకాల విద్యా సంస్థలు ఏర్పాటయ్యాయని వివరించారు. దీంతో మండలంలో జనాభా పెరిగిన కారణంగా ప్రస్తుతమున్న సీహెచ్‌సీని వంద పడకలకు పెంచాలని కోరారు. అదేవిధంగా పీలేరు వంద పడకల ఆసుపత్రికి, వాల్మీకిపురం వైద్యశాలకు వైద్యుల కొరత ఉందని పోస్టులన్నీ భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకోవలసి ఉందని, దాని కోసం ప్రత్యేకంగా వాహనం ఏర్పాటు చేసుకుని తిరుపతి, చెన్నై, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం వ్యయప్రయాసలతో కూడుకున్నదని కలికిరి, పీలేరు, వాల్మీకిపురం ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఇక్కడి వారికి సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. అంతేగాకుండా రాష్ట్రంలోని అన్ని వైద్యశాలల్లో కూడా ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లయితే ప్రభుత్వానికి మంచి పేరొస్తుందని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వం ఆర్థిక భారం లేకుండా ప్రవాసాంధ్రులను సమన్వయం చేసుకుని డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయొచ్చని కిశోర్‌కుమార్ రెడ్డి సూచించారు.

భూసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

● ఇసుకను కుప్పలు పోసి టిప్పర్లతో తరలిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

నిమ్మనపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెకర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ధరఖాస్తులు వచ్చిన వెంటనే సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామాలకు వెళ్లి పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. అలాగే అపార్ ఐడీకి కావలసిన జనన ధృవీకరణ పత్రాలను విద్యార్థులకు అందించాలన్నారు. దీని కొరకు పంచాయతీ కార్యదర్శులు సంబంధిత పాఠశాలకు వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలని తెలిపారు. అలాగే ప్రతి ఆధార్ సెంటర్‌ను తహసీల్దార్‌లు తనిఖీలు చేసి ఎలాంటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలకు ఉచితంగా ఇసుకను ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఉచిత ఇసుకను సొంత అవసరాలకు మాత్రమే వాడాలని యంత్రాలతో ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా ఇసుక తరలింపునకు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు మాత్రమే వినియోగించాలని డంపింగ్ చేసి టిప్పర్ల ద్వారా తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే మండలంలోని అధికారులు పీజీఆర్ఎస్, వివిధ శాఖల వారీగా బాగా పనిచేస్తున్నారని కితాబు ఇచ్చారు. అనంతరం భూసమస్యలపై కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వీటిలో అగ్రహారం పంచాయతీ ఆరిపిరెడ్డిగారిపల్లికి చెందిన వరలక్ష్మి తమకు చెందిన మాదిగ మాన్యాన్ని కొందరు అక్రమార్కులు ఆన్‌లైన్ చేసుకొన్నారని, అలాగే కోట కిందమాలపల్లిలో సీసీ రోడ్డు వేయాలని, వెంగంవారిపల్లి పంచాయతీలో కుంటను కొందరు కబ్జా చేశారని ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాఘువేంద్ర, తహసీల్దార్ ధనంజేయులు, ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కోళ్లబైలు-2లో బయట పడుతున్న అక్రమాలు

● 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగం

● ఒకే వ్యక్తి పేరుతో రూ.11.64 లక్షల బదిలీ

● డీఎల్‌పీవో, ఈవోఆర్డీ సంయుక్త విచారణ

మదనపల్లె టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మొన్న సర్పంచ్ విధులకు గైర్హాజరు, నిన్న వార్డు సభ్యుల సంతకాలు ఫోర్జరీ, నేడు 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగం ఇలా కోళ్లబైలు-2 పంచాయతీలో తవ్వేకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. మదనపల్లె మండలం కోళ్లబైలు-2 గ్రామ పంచాయతీ సర్పంచ్ శశికళ విధులకు గైర్హాజరవుతుండటంపై విచారణ చేపట్టగా కోళ్లబైలు-2 గ్రామ సచివాలయంలో మీటింగ్, రెసొల్యూషన్ రిజిస్టర్ పరిశీలనలో వార్డు సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేసినట్లు తేలిందని మదనపల్లె డీఎల్పీవో నాగరాజు బుధవారం చెప్పిన విషయం విదితమే. తాజాగా గురువారం కోళ్లబైలు-2కు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులతో ఎలాంటి రెసొల్యూషన్ లేకుండా ఇక్కడ బిల్‌కలెక్టర్‌గా పనిచేసిన వ్యక్తి పేరిట రూ.11,64,214 పీఎఫ్ఎంఎస్ బదిలీ చేయడం బయట పడింది. కోళ్లబైలు-2 గ్రామ పంచాయతీకి గత 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.22 లక్షలు విడుదలైంది. రెండు నెలల క్రితం గ్రామ పంచాయతీలోకి బాబు కాలనీ, ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు 2 బోర్లు, 500 వీధి దీపాలు కొనుగోలు చేయాలని ఆ ప్రాంత ప్రజల కోరిక మేరకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సెప్టెంబరు నెలలో అప్పటి పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఇది తెలిసి ఓ వ్యక్తి ఒకే నెలలో (అక్టోబరులో) బిల్ కలెక్టర్‌గా పనిచేసిన పి.రామ్మోహన్ అనే వ్యక్తి పేరిట లెక్కా జమ లేకుండా గ్రామ పంచాయతీ నిధులను రూ.11,64,214ను పీఎఫ్ఎంఎస్ ఖాతాకు బదిలీ చేశారు. అతనికి ఈ నిధులు ఎందుకు బదిలీ చేశారో అన్న విషయం రికార్డులో లేనట్లు తెలిసింది. దీనిపై గ్రామ ప్రజల ఫిర్యాదు మేరకు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డీఎల్‌పీవో నాగరాజు, ఈవోఆర్డీ అబ్దుల్‌షకూర్ సంయుక్తంగా విచారణ చేపట్టారు. ఈ నిధులు ఏ లెక్క కింద ఖర్చు పెట్టారు, అంత సొమ్ము ఒకే వ్యక్తి పేరిట ఎందుకు బ్యాంకు నుంచి బదిలీ చేశారు..? అన్న విషయాలపై ఆరా తీస్తున్నారు. ఈ విషయమై సెక్రటరీ గిరిధర్ నాయక్ వద్ద ఏవైనా రికార్డులు ఉన్నాయా అని ప్రశ్నించారు. గిరిధర్‌నాయక్ మాట్లాడుతూ తాను 20 రోజుల క్రితమే కోళ్లబైలు-2 గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టానని, ఈ నిధులన్నీ అక్టోబరులో బదిలీ అయినట్లు తెలుస్తోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి కోళ్లబైలు-2లో జరిగిన అక్రమాలను వెలికి తీయాలని ప్రజలు కోరుతున్నారు.




కోళ్లబైలు-2 పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు, ఈవోఆర్డీ అబ్దుల్‌షకూర్

ఎంత మంది ఉన్నా ఓకే..

● స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అర్హులే.. ● 30 సంవత్సరాల నిబంధనలకు చరమగీతం ● అసెంబ్లీలో బిల్లు పాస్ చేసిన ప్రభుత్వం

సర్పంచ్‌కు పోటీ చేస్తే.. ముగ్గురు బిడ్డలు అన్నారు..



నాకు ముగ్గురు పిల్లలు. 1995 జూన్ 30న సంబేపల్లె సర్పంచ్‌గా గెలిచాను. ఎన్నికల్లో పోటీ చేసేందుకు వెళితే ముగ్గురు బిడ్డలని అభ్యంతరం చెప్పారు. ఎన్నికల అధికారిని అడిగితే.. 1994 కంటే..ఎంత మంది పిల్లలు ఉన్నా పోటీ చేయవచ్చని తెలిపారు. దీంతో పోటీ చేసి గెలిచాను. ప్రస్తుతం ఈ నిబంధన తొలగించడం సంతోషంగా ఉంది. పిల్లలు ఎంత మంది ఉన్నా.. పోటీ చేసేందుకు అవకాశం కల్పించడం మంచిదే.

- గోపాల్, మాజీ సర్పంచ్





(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఒకరు ముద్దు.. ఇద్దరు హద్దు.. ముగ్గురు వద్దు.. సుమారు 30 సంవత్సరాల పాటు.. ఈ నినాదం వినని తెలుగుపల్లె సీమ ఉండదేమో? కుటుంబ నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ప్రచారం కోసం తయారు చేసిన ఈ నినాదానికి నేటితో తెరపడనుంది. 1994లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జనాభా పెరుగుదలను అరికట్టేందుకు ప్రజల్లో జనాభా పెరగడం వల్ల కలిగే సమస్యలపై అవగాహన కలిగించేందుకు ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనర్హులకుగా పేర్కొంటూ నిబంధన తెచ్చింది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఆందోళనకర స్థాయిలో జనాభా తగ్గిపోతోంది. దీంతో ఇప్పటి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఈ నిబంధనకు చరమగీతం పాడుతూ గురువారం అసెంబ్లీలో దీనిపై బిల్లు పాస్ చేసింది.

కుటుంబ నియంత్రణ కోసం...

సుమారు 30 సంవత్సరాల కిందట దేశ జనాభా విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో జనాభా నియంత్రణకు అప్పటి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. కుటుంబ నియంత్రణపైన ప్రజలకు అవగాహన కల్పించేందుకు అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం సంచలనమైన నిర్ణయం తీసుకుంది. ఏపీ పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు. 1994 మే నెల కంటే ముందు పుట్టి ఉంటే అర్హులే. అప్పట్లో ఈ నిబంధన పల్లెల్లో కలకలం రేపిందనే చెప్పవచ్చు. రాజకీయంగా ఆశలు కలిగిన ఎందరో ఈ నిబంధన వల్ల అవకాశాలు కోల్పోయారు. అలా కుటుంబ నియంత్రణ కోసం ప్రభుత్వం చేపట్టిన విస్తృత ప్రచారం నేపథ్యంలోనే పై నినాదం పురుడు పోసుకుంది. అలా పుట్టిన ఈ నినాదం వీధి వీధికి, గడపగడపకూ చేరింది.

తగ్గుతున్న జనాభా

దక్షిణ భారతదేశంలో ఇంకా చెప్పాలంటే తెలుగు రాష్ట్రాలలో గత కొన్ని సంవత్సరాలుగా జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. సంతానోత్పత్తి ప్రమాదకర స్థాయిలో ఉంది. వృద్ధుల సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో రాష్ట్రప్రభుత్వం జనాభా పెరుగుదలకు ప్రజల్లో అవగాహన పెంచుతోంది. ఈ నేపథ్యంలోనే 1994లో తెచ్చిన ఇద్దరి కంటే.. ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు అనే నిబంధనను రద్దు చేసింది. ఈ మేరకు గురువారం అసెంబ్లీలో ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ నిబంధన తీసేయడం మంచిదని పలువురు పేర్కొంటుండగా.. ఇది ఉండడం వల్ల తీసేయడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని ఇంకొందరు పేర్కొంటున్నారు.

చాలా సంతోషం..



గతంలో జడ్పీటీసీగా పనిచేశాను. ఎంపీపీగా పదేళ్లుగా పనిచేశాను. గతంలో ఇద్దరికి మించి పిల్లలు ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అవకాశం ఉండేది కాదు. దీంతో చాలా మంది నిరుత్సాహం పడేవాళ్లు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ఇద్దరికి మించి పిల్లలు ఉన్నా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కల్పించడం సంతోషకరం.

- రెడ్డెప్పరెడ్డి, మాజీ జడ్పీటీసీ

లాభం లేదు.. నష్టం లేదు..



ఇద్దరి పిల్లల కంటే ఎక్కువ మంది ఉన్నా స్థానిక సంస్థల్లో పోటీ చేయవచ్చు అనే నిర్ణయం వల్ల ఇప్పుడు లాభంలేదు.. నష్టం లేదు.. ఇప్పట్లో ప్రజలు ఇద్దరు బిడ్డలకే ఆపరేషన్ చేయించుకుంటున్నారు.. గతంలో ముగ్గురు బిడ్డలు ఉంటే.. ఎన్నికలకు పోటీ చేయడానికి అనర్హులు. అప్పటి తరం ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేయడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

- వెంకటరమణ, మాజీ ఎంపీపీ మదనపల్లె

గృహ ప్రవేశానికి వచ్చి మృత్యు ఒడికి..

● రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి

● మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

● అందరూ ఒకే కుటుంబ సభ్యులు



ప్రమాదానికి కారణమైన బస్సు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

తిరుపతి (నేరవిభాగం)/పుల్లంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఆ ఇంట్లో తీరని విషాదాన్ని నింపింది. కుమారుడి గృహ ప్రవేశానికి కారులో వెళుతున్న తల్లితో పాటు ఆమె కుమార్తెను ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ఈ విషాద ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలోని వేదాంతపురం వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మినగర్ క్షత్రియ ఎన్‌క్లేవ్ అపార్టుమెంటులో కాపురముంటున్న బిల్డర్ రాజశేఖర రాజు వేదాంతపురం పంచాయతీ ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌లో నూతనంగా ఇల్లు నిర్మించాడు. గృహ ప్రవేశానికి అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రంగంపల్లి నుంచి ఆయన తల్లి సావిత్రి (80), చెల్లెలు సంగీత (38), అక్క వచ్చారు. వారందరూ టీఎన్ 12-4581 నెంబరు కారులో ధనలక్ష్మి నగర్ నుంచి గృహప్రవేశం జరుగుతున్న ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌కు బయలుదేరారు. వేదాంతపురం క్రాస్ వద్ద బైపాస్ దాటుతుండగా నల్గొండ నుంచి బెంగళూరుకు వెళుతున్న బాలాజీ ట్రావెల్స్ బస్సు వేగంగా ఢీకొంది. దాదాపు 50 అడుగుల వరకు లాక్కెళ్లడంతో కారు నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సావిత్రి, ఒంటిమిట్టకు చెందిన సంగీత (38) తీవ్రంగా గాయపడ్డారు. జ్యోతి, లక్ష్మీదేవి స్వల్పంగా గాయపడ్డారు. వీరిని తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ సావిత్రి, సంగీత మృతి చెందారు. మిగిలిన ఇద్దరి పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని పోలీసులు చెప్పారు. సంగీత తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రమేష్ భార్య. కాగా బస్సు డ్రైవర్ సురేష్‌ను అదుపులోకి తీసుకుని బస్సును సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. రాజశేఖర్ రాజు తమ్ముడు రాఘవరాజు ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.



మృతి చెందిన సావిత్రమ్మ, సంగీత



భవన నిర్మాణ కూలీలకు వరం

సంక్షేమ చట్టం

● సంక్షేమ చట్టంతో కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు

● అవగాహన లేమితో దూరంగా కార్మికులు

● సద్వినియోగం చేసుకోవాలంటున్న కార్మిక శాఖ

6

కేసీ కెనాల్ ఆక్రమణలపై

చర్యలు వేగవంతం

● రాయచోటి ఆర్డీవో, మరో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు, నలుగురు మున్సిపల్ కమిషనర్లకు నోటీసులు

● ఐదుగురు టౌన్ ప్లానింగ్ అధికారులు..

● మరో ఎంపీడీవోకూ చివరి నోటీసులు

6

ల్యాప్‌టాప్‌ల కొనుగోల్‌మాల్


● ట్రిపుల్‌ఐటీల్లో నాణ్యతకు తిలోదకాలు

● 2023లో 6500 ల్యాప్‌టాప్‌ల కొనుగోలు

● కొనుగోలులో అవినీతి జరిగిందని మండలిలో చర్చ

● ల్యాప్‌టాప్‌లు లేకుండానే విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

● రూ.5 కోట్ల మేర అవినీతి



వేంపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక యూనివర్సిటీ (ఆర్జీయూకేటీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో విద్యార్థులకు అందించే ల్యాప్‌టాప్‌లలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. కొనుగోలు చేసిన వెంటనే అవి పనిచేయకుండా పోతున్నాయి. ఇప్పటికే మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించలేని దుస్థితిలో ట్రిపుల్‌ఐటీలు ఉన్నాయి. 2023లో సుమారు రూ.18 కోట్లు వెచ్చించి 6500 ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేశారు. ఇందులో సుమారు రూ.5 కోట్ల మేర అవినీతి జరిగిందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. టెండర్ ప్రక్రియ అంతా సక్రమంగా జరిగినట్లు చూపుతున్నప్పటికీ బయట మార్కెట్‌లో రూ.19 వేలకు మించి ధర పలకని ల్యాప్‌టాప్‌లకు రూ.27 వేలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఇందులో కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయంపై శాసనమండలిలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ల్యాప్‌టాప్‌ల్లో అవినీతి జరిగిందని సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేయగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ల్యాప్‌టాప్‌ల కొనుగోలులో అవినీతి జరిగిందని అంగీకరిస్తూనే 90 రోజుల్లో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీలు ఉండగా ఒక్కో దానిలో 6 వేల మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 24 వేల మందికి పైగా విద్యనభ్యసిస్తున్నారు. ట్రిపుల్‌ఐటీలో చేరిన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో విద్యాబోధన చేపట్టాలనే వినూత్న బోధనతోనే నెలకొల్పారు. చేరిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ప్రభుత్వమే ఇస్తుంది. 2008లో ప్రారంభమైన ట్రిపుల్ ఐటీలలో సకాలంలో ల్యాప్‌టాప్‌లు అందించారు. కానీ సంవత్సరాలు గడిచేకొద్దీ మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు వెంటనే ల్యాప్‌టాప్‌లు ఇచ్చే పరిస్థితి లేకుండాపోయింది. నిధుల కొరతగాని, అధికారులు చర్యలు తీసుకోవడంలో జాప్యం గాని మరే ఇతర కారణాలతో ట్రిపుల్‌ఐటీలు నెలకొల్పి ల్యాప్‌టాప్‌లతోనే విద్య అన్న లక్ష్యం నీరుగారుతూ వస్తోంది. కొన్నిసార్లు మొదటి రెండు సంవత్సరాలు కూడా ల్యాప్‌టాప్ లేకుండానే పీయూసీ పూర్తి చేసిన విద్యార్థులు గతంలో ఉన్నారు. ఈ ఏడాది ఆగస్టులో 4400 మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీల్లో చేరారు. ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో చాలా మంది విద్యార్థులకు ఇప్పటికీ ల్యాప్‌టాప్‌లు అందలేదు. నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీల్లో కొందరికి కొత్తవి అందించగా మరికొందరికి పాత వాటినే మళ్లీ మరమ్మతులు చేయించి అందించారు. ఇది ప్రస్తుతం ట్రిపుల్‌ఐటీల్లో ట్యాప్‌టాప్ విద్యపరిస్థితి. నాణ్యమైన ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంటోందని విద్యార్థులు వాపోతున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

ఆర్జీయూకేటీలోని నాలుగు ట్రిపుల్‌ఐటీలకుగాను గత ఏడాది 600 ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఆ మేరకు టెండర్ ప్రక్రియ నిర్వహించినట్లు తెలిసింది. ఒక్కో ల్యాప్‌టాప్‌నకు రూ.27 వేలకు పైగా వెచ్చించినట్లు తెలుస్తోంది. అయితే బయటి మార్కెట్‌లో రూ.19 వేలకు మించి ధర పలకదనే ఆరోపణలు ఉన్నాయి. టెండర్ ప్రక్రియ సజావుగా సాగుతున్నట్లు పైకి కనిపించేలా ప్రక్రియ సాగిస్తారు. కానీ అందులో సుమారు రూ.5 కోట్ల కమీషన్ల రూపంలో అవినీతి జరిగినట్లు టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇందుకు గాను ల్యాప్‌టాపుల్లో నాణ్యతలేని పరికరాలు అమర్చి అందించినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే సుమారు 1500కు పైగా ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేసన వెంటనే మరమ్మతులకు వచ్చినట్లు చెబుతున్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ సాగిస్తే అసలు విషయం వెల్లడవుతుంది.

అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి : ఎమ్మెల్సీ

ఆర్జీయూకేటీ పరిధిలో ఉన్న ట్రిపుల్‌ఐటీల్లో ల్యాప్‌టాపుల్లో భారీ అవినీతి జరిగిందని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలి సమావేశంలో ట్రిపుల్‌ఐటీలలో నెలకొన్న సమస్యలపై ప్రస్తావిస్తూ గత ఏడాది 6500 ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేశారని, నాణ్యత లేకుండా కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లకు అధిక ధరను వెచ్చించారని తెలిపారు. బయటి మార్కెట్‌లో రూ.19 వేలకు మించని వాటికి రూ.28 వేలకు పైగా వెచ్చించడం చూస్తుంటే ఇందులో కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందన్నారు. ల్యాప్‌టాప్‌లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, దీనిపై సంవత్సరాలు తరబడి విచారణ కాకుండా నిర్దిష్ట గడువులోగా సమగ్ర విచారణ జరపాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ అడిగారు.

90 రోజుల్లోగా విచారణ పూర్తి చేస్తాం

ట్రిపుల్‌ఐటీలకు కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌ల్లో అవినీతి జరిగిందని అంగీకరించిన విద్య, ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్ 90రోజుల్లో విచారణ పూర్తిచేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని శాసనమండలిలో తెలిపారు. ఎమ్మెల్సీ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌ల్లో 1500 వరకు రిపేర్లు ఉన్నాయని, సౌండ్ సరిగ్గా లేదని, అసలు సిస్టం సరిగ్గా లేదని ఇలా రకరకాల సాంకేతిక సమస్యలు ల్యాప్‌టాప్‌ల్లో ఉన్నాయన్న విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అసంపూర్తిగా 'నాడు - నేడు'

● కలగా మారిన కళాశాల భవన నిర్మాణాలు

● ఇబ్బందుల్లో విద్యార్థినులు

● భవనాల కోసం తప్పని ఎదురుచూపులు

7

వర్గీకరణ ఫలాలు అందాలనే పోరాటం

ఉమ్మడి చిత్తూరు జిల్లా మాదిగల ఆత్మీయ సమావేశంలో మంద కృష్ణమాదిగ

6

నష్టాల.. దానిమ్మ

● కుప్పకూలిన ధర.. కేజీ రూ.200 నుంచి రూ.50కి

● సైజు లేకుంటే రూ.30...

● దిక్కుతోచని స్థితిలో దానిమ్మ రైతులు

6

● నష్టాలతో రైతులు ఉక్కిరిబిక్కిరి



మచ్చలు వచ్చిన దానిమ్మ కాయలు

భవన నిర్మాణ కూలీలకు వరం

సంక్షేమ చట్టం

- **ఈ చట్టంతో కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు**
- **అవగాహన లేమితో దూరంగా కార్మికులు**
- **సద్వినియోగం చేసుకోవాలంటున్న కార్మిక శాఖ**

పీలేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మిక రంగంలో భవన నిర్మాణ రంగానిదే అగ్ర తాంబూలం. ఉన్న చోటనే లేక సమీప ప్రాంతంలోనే భుక్తి మార్గం కల్పించడంలో భవన నిర్మాణ రంగానిది ప్రత్యేకత. అందుకనే చాలామంది రైతులు, రైతు కూలీలు, సాధారణ కూలీలు తమ సంప్రదాయ వృత్తులను వదిలి భవన నిర్మాణ రంగంలోకి వెళుతుంటారు. నైపుణ్యం, అనుభవం, నేర్పరితనాన్ని బట్టి నిర్మాణ రంగంలో వేతనాలు ఉంటుంటాయి. శారీరకంగా ధృడంగా ఉన్నన్నాళ్లు ఎటువంటి రిటైర్మెంట్ లేకుండా పనిచేసుకునే అనువైనది నిర్మాణం రంగం. అయితే నిత్యం ప్రమాదపు అంచుల్లో పనిచేసే ఆ రంగంలోని తాపీమేస్త్రీలు, కూలీలకు రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే ఉంటుంటాయి. నిత్యం ఎక్కడో ఒకచోట భవన నిర్మాణ రంగ కూలీలు మృత్యువాతపడుతూనే ఉంటారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా మేస్త్రీలు, గృహ యజమానులు అందించే కాసింత పరిహారంతోనే ప్రమాదానికి గురైన వారు సరిపుచ్చుకుంటూ ఉంటారు. ఇక ప్రమాదాల కారణంగా అంగవైకల్యం పొందిన వారైతే చేసేది లేక ఇంటి పట్టునే ఉంటూ నిరాశతో జీవితం గడుపుతూ ఉంటారు. నిర్మాణ రంగంలోని ఇటువంటి ఇబ్బందులను తొలగించి మేస్త్రీలు, కూలీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మిక సంక్షేమ చట్టం 1996, ఆంధ్రప్రదేశ్ నిబంధనలు-1999ను అమలు చేస్తున్నాయి. కేవలం నామమాత్రపు రుసుంతో కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకున్న వారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తూ వారికి ఆదరవుగా నిలుస్తోంది సంక్షేమ చట్టం. భవన నిర్మాణ రంగంలోని ఏ విభాగంలోని వారైనా సంక్షేమ చట్టంలోని ప్రయోజనాలను పొందేందుకు అర్హులేనని, వారు చేయాల్సిందల్లా కేవలం కార్మిక శాఖ వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవడం మాత్రమేనని చెబుతోంది ఈ చట్టం.

నమోదుకు కావాల్సిన అర్హతలు

- 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న భవన నిర్మాణ కార్మికులు అర్హులు.
- వయస్సు ధృవీకరణ కోసం రేషన్ కార్డు, ఓటరు కార్డు, జనన లేక స్కూలు సర్టిఫికెట్ జిరాక్స్ పత్రాలు అందజేయాలి.
- నమోదు చేసుకోవాల్సిన రోజుకంటే ముందు 90 రోజులకు తగ్గకుండా నిర్మాణ రంగంలో పనిచేయాల్సిన అనుభవం కలిగి ఉండాలి.
- నమోదుకు రూ.110 (రూ.50+రూ.60) చెల్లించి సంబంధిత కార్మిక శాఖాధికారి ద్వారా 5 సంవత్సరాలకు ఒకేసారి నమోదు చేయించుకోవచ్చు. తరువాత రూ.60 చెల్లించి 5 ఏళ్లకు ఒకేసారి రెన్యువల్ చేయించుకోవచ్చు.

సంక్షేమ బోర్డు ద్వారా లభించే ప్రయోజనాలు

- పనిచేసే ప్రదేశాల్లో మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షల పరిహారం
- 50 శాతం లేదా అంతకు మించి అంగవైకల్యం పొందిన వారికి రూ.లక్ష పరిహారం.
- 26 శాతం నుంచి 49 శాతం వరకు అంగవైకల్యం కలిగిన వారికి రూ.50 వేలు పరిహారం.
- 25 శాతం వరకు అంగవైకల్యం పొందిన వారికి రూ.25 వేలు పరిహారం.
- సాధారణ మరణం పొందిన వారికి రూ.60 వేల ఆర్థిక సాయం.
- కార్మికుడి భార్యకు రెండు కాన్పులకు రూ.20 వేల ప్రసూతి సాయం లభిస్తుంది.
- భవన నిర్మాణ కార్మికులకు అనారోగ్య సమయంలో రోజుకు రూ.300 చొప్పున నెలకు రూ.3 వేలకు మించకుండా మూడు నెలల వరకు చెల్లిస్తారు.
- అంతిమ సంస్కార ఖర్చులకు రూ.20 వేలు చెల్లిస్తారు.
- జాతీయ నిర్మాణ శిక్షణ సంస్థ(న్యాక్) ద్వారా కార్మికులకు ఎలక్ట్రికల్, తాపీ పని, ప్లంబింగ్, పెయింటింగ్, బార్ బెండింగ్, వడ్రంగి విభాగాలలో రోజుకు రూ.300 శిక్షణ భృతి చెల్లిస్తూ ఉచిత, భోజన, వసతి సౌకర్యాలతో శిక్షణ అందిస్తారు.
- ఏ పింఛను పథకం కింద సభ్యులుగా నమోదు కాని వారికి జాతీయ పింఛను పథకంలో లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారు.
- బోర్డు ద్వారా గుర్తింపు కార్డు పొందిన అవివాహితులైన మహిళా కార్మికులు, లబ్ధిదారులైన కార్మికుల కుమార్తెలకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని వివాహ కానుకగా అందిస్తారు.
- కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డు పొందని కార్మికులు కూడా ప్రమాదంలో మరణిస్తే రూ.50 వేలు లేదా ప్రమాదం జరిగితే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరక ఆర్థిక సాయం అందిస్తారు.

విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం...



కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు పొందిన వారికి లభించే ప్రయోజనాల గురించి కార్మికుల్లో విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నాం. అవగాహన లేమి, నిరక్షరాస్యత కారణంగా చాలా మంది ఈ పథకానికి దూరంగా ఉంటున్నారు. పీలేరు కార్యాలయం పరిధిలోని పీలేరు, కేవీపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, ఐరాల, తవణంపల్లె, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, పాకాల మండలాల నుంచి 2009 నుంచి 2024 వరకు 14,661 కార్మికులు నమోదు చేసుకున్నారు. వారిలో కేవలం 60 శాతం మంది మాత్రమే రెన్యువల్ చేసుకున్నారు. వారందరినీ గుర్తించి వారు కూడా రెన్యువల్ చేయించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాం. తమ దగ్గర పనిచేసే కార్మికులను తాపీ మేస్త్రీలు విధిగా కార్మిక శాఖ వద్ద నమోదు చేయించాలి. అప్పుడే ఈ పథకం అందరికీ అందుతుంది.

● ఆనంద్, సహాయ కార్మిక శాఖాధికారి, పీలేరు



పీలేరులో భవన నిర్మాణంలో కార్మికులు

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

వాల్మీకిపురం, నవంబరు 14: సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని అలా కాదని నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ మండలంలో చుక్కల భూముల రీవెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, చుక్కల భూముల సమస్యలు, రెవెన్యూ సేవల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎప్పటికప్పుడు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్, అపార్ కార్యక్రమాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మండలంలో ఎక్కడా రెవెన్యూ సమస్యలు ఉండకూడదని ఆ దిశగా అధికారులు పనిచేయాలన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన లేఔట్లలో కాలనీ నివాసాల అమ్మకాలు, కొనుగోలు చేసినా ప్రభుత్వ చ ర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి శాఖకు చెందిన అధికారులు కూడా తమ వి ధుల విషయంలో నిర్లక్ష్యం చూపక ప్రజలకు సేవలందించాలన్నారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రం, రోడ్లు పరిశీలన

వాల్మీకిపురం మండలంలోని నాలుగవ అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కేంద్రంలో పరిధిలో ఉన్న పిల్లలు, రోజువారీ హాజరు తదితర వివరాలను ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం జర్రావారిపల్లె, చింతలవారిపల్లె గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మదనపల్లె ఆర్డీవో రాఘువేంద్ర, డ్వామా పీడీ వెంకటరత్నం, డీఎల్‌డీవో ఆనందరెడ్డి, హౌసింగ్ ఈఈ నీలకంఠదాస్, ఏపీడీ శ్రీనివాసులు, పీఆర్ డీఈ మధు, తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీవో మనోహర్‌రాజు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ ఫలాలు అందాలనే పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మదనపల్లె అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగలకు అందాలనే పోరాటం చేస్తున్నామని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం మదనపల్లె పట్టణం, చౌడేశ్వరీ కల్యాణ మండపంలో నిర్వహించిన చిత్తూరు ఉమ్మడి జిల్లా మాదిగల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మాదిగల ఎస్సీ వర్గీకరణతో పాటు సమాజం కోసం పోరాటాలు, ఆందోళనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరణ చేస్తే మాదిగలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారని చెప్పారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వేషన్ కోసం 59 కులాలు పోరాటాలు చేస్తుంటే మాలలు ఒక కులం మాత్రం వ్యతిరేకించడం దారుణమన్నారు. దశాబ్దాల పోరాటాల ఫలితమే ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ సాధించామన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వానికి అన్ని విధాలుగా మాదిగలు పూర్తి సహకారం అందించినప్పటికీ జగన్ మాత్రం ఐదేళ్లలో ఐదు నిమిషాలు కూడా ఎస్సీ వర్గీకరణ గురించి మాట్లాడలేదని అన్నారు. చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణకు సహకారం అందించారని చెప్పారు. మాదిగల గురించి పట్టించుకోని జగన్‌కు మద్దతుగా ఉండాలా, లేదా మాదిగలకు అన్ని విధాల సహకారం ఇస్తున్న నారాచంద్రబాబుకు మద్దతుగా ఉండాలా అని మాదిగలు నిర్ణయం తీసుకోవాలన్నారు. ముందుగా వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మౌలాలీ ఆధ్వర్యంలో మందకృష్ణమాదిగను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకులు నరేంద్రబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర(రవి), ఎంఎస్‌పీ నియోజకవర్గ నాయకులు ఆరేటి వాసు, పాల్గొన్నారు.

వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీగా శశిధర్‌రెడ్డి

కలికిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం (డీఆర్సీ) సహాయ సంచాలకులుగా ఆర్. శశిధర్‌రెడ్డిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో గ్రామీణాభివృద్ధి శాఖకు డిప్యుటేషన్‌పై వెళ్లిన శశిధర్ రెడ్డిని గత నెల 23న తిరిగి మాతృ సంస్థ వ్యవసాయ శాఖకు పంపించారు. దీంతో ఆయనను జిల్లా వనరుల కేంద్రం రాయచోటిలో ఏడీగా నియమిస్తూ గురువారం వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ ఆదేశాలు జారీ చేశారు.

ఆక్రమణలపై చర్యలు వేగవంతం

- **రాయచోటి ఆర్డీవో సహా మరో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు నోటీసులు**
- **నలుగురు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు...**
- **ఐదుగురు టౌన్ ప్లానింగ్ అధికారులు ... ఎంపీడీవోకూ నోటీసులు**

కడప/కలికిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప కేసీ కెనాల్‌కు చెందిన భూముల ఆక్రమణలకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన 20 మంది అధికారులను బాధ్యులుగా చేస్తూ గత నెల 30వ తేదీన వారందరికీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి వారి సంజాయిషీలను పేర్కొంటూ 10 రోజుల్లోగా జవాబివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. గడువు ముగిసిన వెంటనే వారు సమర్పించిన సంజాయిషీలతో సంతృప్తి చెందని ప్రభుత్వం తాజాగా ఒక్కొక్కరికీ విడివిడిగా మరోసారి చార్జిషీట్లను జారీ చేసింది. అభియోగాల్లోని అంశాల వారీగా వివరణలు అందజేసేందుకు నిబంధనల ప్రకారం మరోసారి ఈ నోటీసులు జారీ చేసింది.

ఈ దఫా జారీ అయిన వారిలో ప్రస్తుత రాయచోటి ఆర్డీవో ఎ.శ్రీనివాస్‌తో సహా ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లు, నలుగురు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, ఐదుగురు టౌన్ ప్లానింగ్ అధికారులు కాగా మరొకరు చిట్వేలిలో పనిచేసిన ఎంపీడీవో ఉన్నారు. ఈసారి 13 మందికి మాత్రం ఈ నోటీసులు జారీ కాగా వారందరికీ గతంలో వలే కలిపి కాకుండా విడివిడిగానే వేర్వేరుగా జీవోలు జారీ చేసింది. బుధవారం రాత్రి ఈ మేరకు జీవోలు విడుదలయ్యాయి.

కేసీ కెనాల్ ఆక్రమణల వ్యవహారమేంటి?

కేసీ కెనాల్ భూములు ఆక్రమించిన తీరు గురించి తాజాగా జారీ అయిన నోటీసుల్లో ప్రభుత్వం కూలంకషంగా వివరించింది. కడప కేసీ కెనాల్‌కు సంబంధించిన కాలువ పక్కన వున్న గూడూరు గ్రామానికి చెందిన పలు సర్వే నెంబర్లలోని కాలువ కట్ట పోరంబోకు భూముల్లో 7.76 ఎకరాలను ఆక్రమించి రియల్ ఎస్టేట్ మాఫియా వెంచర్లు వేసింది. దీని కోసం కొత్త రామరాజుపల్లె వద్ద కేసీ కెనాల్ సైఫన్‌ను కూడా కూల్చేసి సిమెంటు రోడ్లు వేశారు. ఇక్కడ విజయదుర్గ కాలనీ పేరుతో ఇళ్ల స్థలాలను అభివృద్ధి చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు 2004 జూలైలో ఈ ఆక్రమణలు మొదలు పెట్టారు. ఆక్రమణలను అడ్డుకోవడంలోనూ, ఇండ్ల స్థలాల అభివృద్ధిని నిరోధించడంలోనూ, ప్లాట్లను యథేచ్ఛగా అమ్ముతున్నా అడ్డుకోవడంలోనూ జలవనరుల శాఖ, కడప మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. కాలువ భూముల ఆయకట్టుకు సంబంధించిన మైదుకూరుకు చెందిన కొంతమంది రైతులు, కడప బీజేపీ నాయకుడు ఎల్.రామమోహన్ రెడ్డి చివరికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ శాఖ అధికారులు కేసీ కెనాల్ భూముల ఆక్రమణ, విజయదుర్గ లేఔట్ ఏర్పాటు, అధికారుల సహకారం తదితర అంశాల్లో లోతుగా విచారణ చేసి వాస్తవాలను ప్రభుత్వానికి నివేదించింది. అయితే ఈ వ్యవహారం 2014 వరకూ ఎక్కడికక్కడే నిలిచిపోయింది.

ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం దీనిని తిరిగి లోతుగా పరిశీలించేందుకు చర్యలు తీసుకుంది. అన్ని అడ్డంకులు అధిగమించి విచారణ, తదుపరి చర్యలపై కార్యాచరణ ఒక కొలిక్కి వస్తున్న దశలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఆ తరువాత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇది పూర్తిగా తెరమరుగైంది. తిరిగి కూటమి ప్రభత్వం అధికారంలోకి రావడంతో కేసీ కెనాల్ ఆక్రమణల బాగోతం వెలుగులోకి వచ్చింది.

బాధ్యులైన అధికారులు..

కేసీ కెనాల్ భూముల ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారంలో రెవెన్యూ శాఖకు సంబంధించి అప్పటి కడప మండల తహసీల్దార్లుగా పనిచేసిన ఎల్.రవిశంకర్‌రెడ్డి (ప్రస్తుతం యూత్ వెల్ఫేర్ ఆఫీసర్, అనంతపురం), ఎస్.ప్రేమనాథ కుమార్ (జనరల్ మేనేజర్, ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్, విజయవాడ), ఎ.శ్రీనివాస్ (ఆర్డీవో, రాయచోటి), మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లుగా పనిచేసిన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి (డిప్యూటీ కమిషనర్, తిరుపతి), సి.ఓబులేశు, (కమిషనర్, శ్రీకాకుళం), డి.జన్‌శామ్‌సన్ (తెలంగాణా రాష్ట్రం), ఎస్.అలీమ్ బాషాలున్నారు.

ఇక కార్పొరేషన్ ఉద్యోగులు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ టీసీ కృష్ణ సింగ్ (డీటీసీపీ, కడప), టీపీబీవో జి.శారదాంబ, (టీపీఎస్, తిరుపతి), టీపీబీవో జి.నాగశివప్రసాద్ (టౌన్ ప్లానింగ్ ట్రేసర్, కడప), టీపీబీవో టి.ఎం.రెహ్మాన్ (టీపీవో, హిందూపురం), టీపీఎస్ బి.విజయభాస్కర్ (ప్లానింగ్ ఆఫీసర్, కర్నూలు పట్టణాభివృద్ధి సంస్థ), గూడూరు పంచాయతీ కార్యదర్శి ఎన్.శివరామి రెడ్డి (ఎంపీడీవో, చిట్వేలి తాజాగా గడివేముల కర్నూలు)లు ఉన్నారు. కాగా గత నెల 30వ తేదీన జారీ చేసిన అభియోగ పత్రంలో పోలీసు శాఖ నుంచి ఒక డీఎస్పీ, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, జలవనరుల శాఖకు సంబంధించి నలుగురు ఈఈలు కూడా ఉన్నారు. ప్రస్తుతానికి వీరికి మాత్రం ఎలాంటి నోటీసులు జారీ కాలేదు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరి అరెస్ట్


పెనగలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చెక్ బౌన్స్ కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ జి.రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ప్రకాశం జిల్లా లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన పోలు మోహన్ అనే వ్యక్తికి చెక్‌బౌన్స్ కేసులో నందలూరు కోర్టు ఏడాది జైలుశిక్ష విధించింది. అయితే, అతను శిక్ష అనుభవించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బెంగళూరులో ఉంటున్న మోహన్‌ను అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరు పెట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసులో కానిస్టేబుల్ రామరాజు, కోర్టు కానిస్టేబుల్ శివనాగేంద్ర సహకారం అందించారని తెలిపారు.

పోసానిపై టీడీపీ నేతల ఫిర్యాదు

రాజంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా సోషల్ మీడియాలో తీవ్ర పదజాలంతో దూషించిన పోసాని కృష్ణమురళిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు కోవూరు సుబ్రమణ్యంనాయుడు, అబూబకర్ గురువారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోషల్‌మీడియాను దుర్వినియోగం చేస్తూ పోసాని చేసిన వ్యాఖ్యల వివరాలున్న పెన్‌డ్రైవ్‌ను ఎస్‌ఐకి అందజేశారు. కార్యక్రమంలో శవనవారిపల్లె సర్పంచ్ కోటయ్యనాయుడు, గ్రామీణ ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, పట్టణ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే కరీం, టీడీపీ నాయకులు పాండురాజు, గుణశంకర్ పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో జాతీయస్థాయికి ఎంపిక

ఓబులవారిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నఓరంపాడు జడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థినులు భాను, సారా జాతీయ స్థాయి టెన్నిస్ క్రికెట్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. అక్టోబరులో చెన్నైలోని విల్లుపురంలో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు మొదటి స్థానం సాధించడంలో వారు కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి జమ్ము కశ్మీర్‌లోని జమ్మూతావిలో జరగబోయే పోటీల్లో వారు పాల్గొంటారన్నారు.



ఎగుమతి చేసేందుకు క్రేట్లలో పేర్చిన దానిమ్మ కాయలు

నష్టాల...దానిమ్మ

- **కుప్పకూలిన ధర... కేజీ రూ.200 నుంచి రూ.50కి**
- **సైజు లేకుంటే రూ.30...**
- **దిక్కుతోచని స్థితిలో దానిమ్మ రైతులు**
- **నష్టాలతో రైతన్నలు ఉక్కిరిబిక్కిరి**

ములకలచెరువు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు చివరకు నష్టాలే మిగులుతున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న దానిమ్మ పంట రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. బయటి మార్కెట్‌లో దానిమ్మ ధరలు కుప్పకూలిపోయాయి. కేజీ రూ.200 నుంచి రూ.50కు పడిపోయింది. కాయలు సైజు లేకుంటే కేజీ రూ.30కే అడుగుతున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధర మాత్రం పతనమైంది. ఇటీవల తుఫాను కారణంగా వచ్చిన వర్షాలు దానిమ్మ తోటలను దెబ్బతీశాయి. అధిక శాతం కాయలపై మచ్చలు వచ్చాయి. దీంతో దానిమ్మ రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



మచ్చలు వచ్చిన దానిమ్మ కాయలు

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో దానిమ్మ దిగుబడి పెరగడం, ఇక్కడి కాయలకు మచ్చలు రావడంతో ధరలు పడిపోవడానికి కారణమైంది.

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్ప సముద్రం, తంబళ్లపల్లె మండలాల్లో సుమారు 300 ఎకరాల్లో దానిమ్మ తోటలు సాగులో ఉన్నాయి. డ్రిప్ ఇరిగేషన్ కింద తోటలు సాగు చేశారు. ఎకరా దానిమ్మ సాగుకు రూ.1.50 లక్షల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం దానిమ్మ తోటలు దిగుబడి వస్తున్నాయి. కాయలు కూడా విరగ్గాశాయి. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా కాయలపై మచ్చలు వచ్చాయి. గత నెలలో తుఫాను కారణంగా కురిసిన వర్షానికి అధిక శాతం కాయలపై మచ్చలు ఏర్పడ్డాయి. దీనికి తోడు ప్రస్తుతం కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కూడా దానిమ్మ దిగుబడులు అధికంగా వస్తుండడంతో అక్కడి కాయలపై మచ్చలు లేని కారణంగా ఇక్కడి కాయలకు డిమాండ్ తగ్గింది.

20 రోజుల క్రితం వ్యాపారస్తులు తోటల వద్దకు వచ్చి కేజీ రూ.200తో కొనుగోలు చేశారు. ప్రస్తుతం కేజీ రూ.50కి అడుగుతున్నారు. కాయలపై మచ్చలు అధికంగా ఉండడంతో 150 గ్రాములు ఉన్న కాయలను మాత్రం కేజీ రూ.50తో కొనుగోలు చేశారు. 150 గ్రాముల కంటే తక్కువ పరిమాణం ఉన్న కాయలను కేజీ రూ.30తో అడిగారు. బుధవారం కాయలను కోత చేసి క్రేట్లలో పేర్చి కాయలను తమిళనాడు రాష్ట్రం చెన్నైకి వాపారస్తులు తీసుకెళ్లారు. ఆరు ఎకరాలకు 20 టన్నుల దిగుబడి వచ్చినా ధర లేకపోవడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. పంట నోటికాడికి వచ్చే సమయంలో ధరలు పతనం కావడంతో దానిమ్మ రైతులు మదనపడుతున్నారు.

నీటి తడులు తక్కువ... పెట్టుబడులు ఎక్కువ

రాజస్థాన్ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం ఉంటుంది. ఆ ప్రాంతంలో రైతులు దానిమ్మ సాగు చేసి అధిక లాభాలు గడించారు. ఇక్కడ కూడా భూగర్భజలాలు అంతంతమాత్రంగా ఉండడంతో డ్రిప్ పద్ధతిలో తక్కువ నీటితో పండించే పంటలపై రైతులు మొగ్గు చూపారు. పడమటి మండలాల్లో దానిమ్మ తోటలను విస్తారంగా సాగు చేశారు. అధిక ధరలు వెచ్చించి మందులు పిచికారీ చేసినా తెగుళ్లు, బ్యాక్టీరియా నివారణ చేయలేక పోతున్నారు. దీనికి తోడు ప్రతి ఏటా తుఫాన్ల కారణంగా కురుస్తున్న వర్షాలకు కాయలపై మచ్చలు ఏర్పడుతున్నాయి. దానిమ్మ సాగుకు పెట్టుబడి కూడా ఎక్కువే. మొక్కలు, ఎరువులు, కూలీల ఖర్చు, మొక్కలు నాటడానికి, డ్రిప్ తదితర వాటికి మొదటి ఏడాది ఎకరాకు రూ.1.50 లక్ష ఖర్చు వస్తోంది. రెండవ ఏడాది రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఒకసారి తోట సాగు చేస్తే పదేళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

మచ్చలతో తీవ్ర నష్టం

- కిరణ్‌కుమార్, రైతు, గూడుపల్లె

నేను ఆరెకరాల్లో దానిమ్మ సాగు చేశాను. గత నెలలో కురిసిన తుఫాను కారణంగా కాయలకు మచ్చలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ధరలు కూడా పతనమయ్యాయి. 20 రోజుల క్రితం వరకు కేజీ రూ.200 ఉండేది. ప్రస్తుతం రూ.50కు చేరింది. దీంతో తీవ్రనష్టం వచ్చింది.



గూడుపల్లె సమీపంలో ఉన్న దానిమ్మ తోట

జిల్లాలో కరవు మండలాలు లేవా ?

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్



మాట్లాడుతున్న సీపీఎం నేత గఫూర్

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో 54 కరువు మండలాలు ప్రకటిస్తే కనీసం కడప జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా మీకు కనబడలేదా అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏగఫూర్ ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో భారం మోపడం సరికాదని ఆయన మండిపడ్డారు. మరో పక్క విద్యుత్ స్మార్ట్‌మీటర్లు రద్దు కోసం సమరశీల పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. నిధులు నికర జలాలు, విభజన హామీలు అమలు సమగ్రాభివృద్ధి కోసం జిల్లా పట్ల వివక్ష విడనాడాలన్నారు. మహాధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శి వర్గసభ్యులు దస్తగిరిరెడ్డి, సత్యం, శ్రీనివాసులరెడ్డి, అన్వేష్, నగర నేతలు చంద్రారెడ్డి, బద్వేలు నుంచి చాంద్‌బాషా, వెంకటేశ్, ఒంటిమిట్ట నుంచి నరసయ్య, జమ్మలమడుగు నుంచి యేసుదాసు, విజయ్, శివనారాయణతో వివిధ మండలాల నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌బీ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రారు పద్మ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైవీయూ డిగ్రీ ఎల్‌ఎల్‌బీ సెమిస్టరు పరీక్ష ఫలితాలను ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, సహాయ నియంత్రణాధికారి డాక్టర్ శ్రీనివాసరావు విడుదల చేశారు. చాంబరులో ఫలితాలపై మాట్లాడుతూ ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల రెండో సెమిస్టరులో 113 మంది హాజరుకాగా, 67 మంది (59శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. 4వ సెమిస్టరులో 87మందికి 9 మంది (10శాతం) ఉత్తీర్ణులయ్యారన్నారు. 6వ సెమిస్టరులో 79మందికి 59మంది (74శాతం), 8వ సెమిస్టరులో 73 మందికి 53 మంది (72శాతం) 10వసెమిస్టరులో 122 మందికి 108మంది (88శాతం) ఉత్తీర్ణతసాధించారన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాల్లో

డిగ్రీపరీక్షలకు సంబంధించి బీఏ 7వసెమిస్టరు ఫలితాల్లో 93 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బీబీఏ వంద శాతం, బీకాం వంద శాతం, బీఎస్సీ 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారన్నారు. బీఏ 8వ సెమిస్టరు పరీక్షల్లో 97శాతం, బీబీఏ 93 శాతం, బీకాం వంద శాతం, బీఎస్సీ 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.

పెద్ద దర్గా ఉరుసును దిగ్విజయం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న దర్గా ప్రతినిధులు

కడప కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడపలో వెలసిన ప్రఖ్యాత పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 16వ తేదీ శనివారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా ఉత్సవాలను దిగ్విజయం చేసేందుకు తప్పక హాజరవాలని దర్గా ప్రతినిధులు అమీర్, కుత్‌బుద్దీన్ కోరారు. పెద్దదర్గాలో వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు మలంగ్‌షా సర్‌గిరీలు, ఫకీర్లు బాదుల్లా సాహెబ్ మకాన్‌వద్దకు చేరుకుని చదివింపులు చేస్తారన్నారు. తదుపరి ఊరేగింపుగా దర్గా చేరుకుంటుందన్నారు. రాత్రి 9 గంటలకు ఖవ్వాలి, 10 గంటలకు పీఠాధిపతి నివాసం నుంచి గంధం ఊరేగింపుగా దర్గాచేరుకుని, ఫాతేహా చేసి గంధము సమర్పించనున్నట్లు వెల్లడించారు. 17న సాయంత్రం ఇదార-యే-అమీనియా చిష్తియా వార్షిక నివేదిక సమర్పణ, ఉరుసు ఉత్సవం వేడుకగా జరుగనుందన్నారు. 18న సాయత్రం 5 గంటలకు పీఠాధిపతి మహానైవేద్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 19న విద్వాంసులచే రాత్రి 10 గంటల నుంచి ఖవ్వాలి వుంటుందన్నారు. 20న పీఠాధిపతి శిష్యులతో కలిసి హజరత్ మస్తాన్ స్వామి తపస్సు చేసిన శ్రీ శేషాచల పర్వతంలోని గుహ వద్ద జెండా ప్రతిష్ఠ చేయనున్నారన్నారు.

ఘనంగా సానపురెడ్డి ఓబులమ్మ వర్ధంతి

చిన్నారులకు దుప్పట్లు పంపిణీ



సానపురెడ్డి ఓబులమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న రాంగోపాల్ రెడ్డి, తదితరులు

బద్వేలు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బోవిళ్లవారిపల్లె వాసులు సానపురెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాధాక్రిష్ణరెడ్డి మృత్యుమూర్తి సానపురెడ్డి నాగ ఓబులమ్మ 2వ వర్ధంతి నిర్వహించారు. ఆమె కుమారులు సానపురెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాధాక్రిష్ణరెడ్డి సహకారంతో గురువారం సిద్దవటం రోడ్డులోని షాలోమ్ అనాథ శరణాలయం చిన్నారులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు, మధ్యాహ్న భోజనం అందించారు. మున్సిపల్ ఛైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి వీటిని పంపిణీ చేశారు. అనాథ శరణాలయంలో నాగ ఓబులమ్మ చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నేతలు నివాళులర్పించారు. నాగ ఓబులమ్మ భర్త గోపాల్‌రెడ్డి పట్టణంలో అందరికీ సుపరిచితులు కావడంతో ఈ కార్యక్రమానికి పలువురు హాజరై నివాళులర్పించారు.

ఉల్లి విత్తనాల వ్యాపారిపై కేసు నమోదు చేయాలి

కల్తీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు



పొలాల్లోనే వదిలేసిన ఉల్లిపంటను చూపుతున్న రైతు

వీరపునాయునిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కల్తీ ఉల్లి విత్తనాలు అమ్మి రైతులను మోసగించిన వ్యాపారి మైదుకూరు గురవయ్యపై కేసు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కొమ్మద్ది గ్రామంలో చాలా మంది రైతులు కల్తీ ఉల్లి విత్తనాలు చల్లి దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారని రైతులు కె.ఈశ్వరయ్య, రామాంజనేయులు, పోతులయ్య, విశ్వనాథ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పదెకరాల్లో కల్తీ విత్తనాలతో రైతులు నష్టపోయారని వారు తెలిపారు. జూలైలో గురవయ్య దగ్గర సేరు ఉల్లి విత్తనాలు రూ.1400తో కొనుగోలు చేశామన్నారు. పంటను కాపాడుకున్నా చివరకు ఉల్లి గడ్డలు ఊర లేదన్నారు. ఎకరా సాగుకు రూ.70వేలు పెట్టుబడులు పెట్టామన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

హైవే భూ సేకరణ పనులు పరిశీలించిన జేసీ



మ్యాపును పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

ప్రొద్దుటూరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి - వేంపల్లె హైవే నిర్మాణం కోసం భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. గురువారం ఆమె ప్రొద్దుటూరులోని నేషనల్ హైవే కోసం పోయే భూ ములను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గోపవరం పంచాయతీ ప్రొద్దుటూరు కొత్తపల్లె నంగనూరు పల్లె పొలాల్లో 42.328 ఎకరాలు భూసేకరణ చేపట్టాల్సివుందన్నారు. వీటి సర్వే నెంబర్లు భూరికార్డులు పరిశీలించారు. పరిశీలనలో తహసీల్దారు గంగయ్య ఆర్ఐ నాగమోహన్ రెడ్డి సర్వేయర్ వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా 'నాడు - నేడు'



అసంపూర్తిగా ఉన్న భవనం

కలగా మారిన ఇంటర్ భవన నిర్మాణాలు ● ఇబ్బందుల్లో విద్యార్థినులు

భవనాల కోసం తప్పని ఎదురుచూపులు ● ఇప్పటికైనా పూర్తి అయ్యేనా

వీరబల్లి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగానే జరిగాయి. 'నాడు - నేడు' పథకంలో భాగంగా ప్రతి పాఠశాలనూ అభివృద్ధి చేద్దామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా పనులు ప్రారంభించింది. ఈ పథకం అస్మదీయులకు లబ్ధిచేకూరేందుకే ఏర్పాటు చేసినట్లుగా తయారైంది. వీటి పనులు కూడా వారికే కట్టబెట్టడంతో వారు చేసేదే పని, ఎప్పుడు పూర్తవుతాయో అడగకూడని పరిస్థితి. మంజూరైన వాటిలో కొన్నింటిని పూర్తి చేసినా నిరుపయోగంగా ఉండడం, మరికొన్ని అర్థంతరంగా నిలిచిపోయాయి. ఇందులో భాగంగా కస్తూర్బా జూనియర్ కళాశాల భవనాలు నిధుల్లేక అర్థంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఇంటర్ విద్యార్థినుల కోసం భవనాలు లేకపోవడం చేపట్టక పోవడంతో భవనిర్మాణాలు జరిగేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై స్థానికులు, విద్యార్థినుల తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకెళితే...

స్థానిక కస్తూర్బా పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉండడంతో పంచాయతీల్లోని విద్యార్థులే కాకుండా బయటి ప్రాంతాల నుంచి అనేక మంది విద్యార్థినులు ఇక్కడ 6వ తరగతిలో చేరుతున్నారు. 10వ తరగతి విద్యా ప్రమాణాలు పెంపొందించుకుంటున్నారు. కస్తూర్బా పాఠశాలలో ఇంటర్మీడియేట్ విద్యను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో పాఠశాలలో చేరికలు పెరిగిపోయాయి. ఫలితంగా తరగతి గదులు తక్కువ రావడంతో నాడు- నేడు కింద కస్తూర్బా జూనియర్ కళాశాలకు భవనాలు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో నాడు- నేడు కింద మంజూరైన కస్తూర్బా జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు ప్రతి పాదనలు, ఆర్భాటాలు తప్ప తగినన్ని నిధులు కేటా యించక పోవడంతో సదరు కాంట్రాక్టర్లు అర్థంతరంగా పనులు ఆపేశారు. అంతేకాకుండా పనులపై పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపంతో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి అసౌకర్యాల నడుమ విద్యార్థినులు విద్యను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధించిన జిల్లా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టి విద్యార్థినులకు తగిన సౌకర్యాలు కల్పించి వారి విద్యా ప్రమాణాలను పెంపొం దించేందుకు కృషి చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. భవ నాలు పూర్తి అయితే అన్ని సదుపాయాలు, తమ పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం



తమ పాఠశాలలో సరైన వసతులు లేక ఇబ్బందు లు పడుతున్నాం. తాగడానికి నీరు కూడా సక్రమంగా అందడం లేదు. ఉన్న బోరులో నీరు అడు గంటిపోయాయి. బయట నుంచి క్యాన్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. మాకు సకాలంలో సరైన వసతులు కల్పిస్తే విద్యా ప్రమాణాలు పెంపొందించుకుంటాం.

నాగలక్ష్మి, జూనియర్ ఇంటర్

భవనాలు పూర్తి చేయండి



నాడు- నేడు కింద తమ పాఠశాలకు అదనంగా ఇంటర్మీడియట్ భవనాలు మంజూరయ్యాయి. అవి నిధులు లేక అర్ధాంతరంగా ఆగిపోయాయి. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి తమ విద్యాభివృద్ధికి సహకరించాలి.

దీపిక, జూనియర్ ఇంటర్

బైక్, ట్రాక్టర్ ఢీ - ఇద్దరికి తీవ్రగాయాలు

అడ్డు, అదుపులేకుండా అక్రమంగా బోల్డర్స్ తరలింపు ● ఘటన తరువాత ట్రాక్టర్‌లో బోల్డర్స్ మాయం



ఘటనా స్థలంలో ట్రాక్టర్ కింద పడిన వ్యక్తి

ముద్దనూరు నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్లలో అక్రమ బోల్డర్స్ తరలింపు అడ్డూ అదుపులేకుండా పోయింది. కొండ ప్రాంతంలోని భూముల నుంచి బోల్డర్స్ తరలిస్తున్నారు. ట్రాక్టర్ల వేగానికి అదుపులేకుండా పోతోంది. గురువారం జమ్మలమడుగు రోడ్డులోని ప్రభుత్వ ఇళ్ల లేఔట్ సమీపంలో బోల్డర్స్ తరలిస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో ఒకరికి రెండు చేతులకు గాయాలు, ఛాతికి తీవ్రగాయమైంది. మరొకరు బైకు నుంచి కింద పడడంతో తల వెనుక తీవ్రగాయమైంది. అయితే ట్రాక్టర్‌లో బోల్డర్స్ ఉంటే కేసు అవుతుందని ట్రాక్టర్ యజమాని గ్రహించినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను మరో చోటికి తీసుకెళ్లి బోల్డర్స్ అన్‌లోడు చేసి ఎంతో చాకచక్యంగా ఖాళీ ట్రాక్టర్‌ను ప్రమాద స్థలంలో నిలిపారు. ఇంత జరుగుతున్నా పోలీసుల తీరుపై పలు విమర్శలు వినిపిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు వివరాల్లోకెళితే....

కొండాపురం మండలం ఓబన్నపేట వాసులు సురేంద్రారెడ్డి, బాబు బైక్‌లో జమ్మలమడుగుకు వెళుతున్నారు. ప్రభుత్వ ఇళ్ల లేఔట్ సమీపం నుంచి ముద్దనూరుకు చెందిన ట్రాక్టర్ మట్టి రోడ్డు గుండా కొండ ప్రాంతం నుంచి బోల్డర్స్ తీసుకుని వస్తోంది. జామాయిల్ చెట్ల ప్రాంతంలో మెయిన్ రోడ్డు పైకి ట్రాక్టర్‌ను అతి వేగంగా తిప్పాడు. ఉన్నఫళంగా ట్రాక్టర్ రోడ్డుపైకి రావడంతో ముద్దనూరు వైపు నుంచి వస్తున్న బైక్ పైకి రావడంతో ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీ మధ్యలో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైకు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. సురేంద్రారెడ్డి తలకు హెల్మెట్ పెట్టుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. రెండు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ఛాతీకి తీవ్రగాయమైంది. బైకులో వెనుక కూర్చున్న బాబుకు తల వెనుక తీవ్రగాయమైంది. వెంటనే 108లో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్క డ వైద్యం అందించి కడపలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

అదుపు లేకుండా బోల్డర్స్ తరలింపు

ట్రాక్టర్ల యజమానులు అడ్డు, అదుపు లేకుండా అక్రమంగా బోల్డర్స్ తరలిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండ ప్రాంతం నుంచి పునాదుల కోసం కొండ రాళ్లను తరలిస్తున్నారు. ట్రాక్టర్లు అతివేగంగా వస్తుంటాయి. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించకుండా వస్తుండడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నదానికి ఇదే నిదర్శనమని ప్రజలు అంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

బోల్డర్స్ తోలుకునేందుకు రెవెన్యూ పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. రెవెన్యూ సిబ్బందిని పంపి పరిశీలిస్తాం. కొండ ప్రాంతంలో కొందరికి డీకేటీ పట్టాలు ఇచ్చారు. ఆ భూమిలో ఉన్న బోల్డర్స్‌ను కొందరు ట్రాక్టర్ యజమానులు తోలుకుంటున్నారు. భూమి సాగు పనులు చేస్తున్నారా అన్నదాని పూర్తి వివరాలు సేకరిస్తాం. తదుపరి తగుచర్యలు తీసుకుంటాం.

వరదకిశోర్‌రెడ్డి, తహసీల్దారు,ముద్దనూరు

అర్ధరాత్రి ఇసుక రీచ్‌ల తనిఖీ

రెండు టిప్పర్లు సీజ్ చేసిన ఆర్డీఓ

కొండాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుక రీచ్‌లను గురువారం అర్ధరాత్రి జమ్మలమడుగు ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీ తనిఖీ చేశారు. తిమ్మాపురం క్రాస్ వద్ద గురువారం ఒంటిగంటకు ఆర్డీఓ వాహనాలను సిబ్బందిచే తనిఖీ చేయించారు. ముందస్తు సమాచారంతో తెల్లవారుజామున ఆర్డీఓ ఆకస్మిక దాడులు నిర్వహించారు. బిల్లులు లేకుండా ఇసుకను తీసుకెళుతుండగా రెండు టిప్పర్లను సీజ్ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు నంద్యాల వైపు వెళుతున్న రెండు ఇసుక టిప్పర్లను సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప పాల్గొన్నారు.

నిందితులకు జైలు శిక్ష

బద్వేలుటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు ప్రేరేపితులు, ఆంజనేయనగర్ వాసులు భూమిరెడ్డి శివారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డికి మూడేళ్ల జైలు, రూ.1000 జరిమానా కోర్టు విధించింది. వివరాల్లోకెళితే....

2014లో భూమిరెడ్డి రామసుబ్బారెడ్డిని మోసంచేసి, బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించడంతో అతను చనిపోయాడు. ఈమేరకు నిందితులు భూమిరెడ్డి శివారెడ్డి, భూమిరెడ్డి శాంతమ్మ, భూమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, భూమిరెడ్డి ఇంద్రసేనారెడ్డిపై కేసు నమోదు చేశారు. విచారణ సమయంలో భూమిరెడ్డి శాంతమ్మ, భూమిరెడ్డి ఇంద్రసేనారెడ్డి మరణించడంతో మొదటి నిందితుడు భూమిరెడ్డి శివారెడ్డికి, మూడో నిందితుడు భూమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డిలకు శిక్షను ఖరారు చేశారు. పదేళ్ల కిందటి కేసులో నేడు కోర్టు శిక్షను తీర్మానించింది.

మహిళ అదృశ్యం

కడప(క్రైం)నవంబరు14(ఆంధ్రజ్యోతి): కడప నగరం వైఎస్ఆర్ కాలనీకి చెందిన మహిళ అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి తెలిపారు. సత్యసాయి జిల్లాకు చెందిన రాగుల వెంకట రమణ జీవనోపాధి నిమిత్తం వైఎస్ఆర్ కాలనీలో ఉంటున్నాడు. జీపు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. భార్య రాగుల వైశాలి ఇంటివద్దే ఉంటోంది. 13న వైశాలి ఇంటి నుంచి వెళ్లినట్లు తెలిపా రు. భర్త ఫిర్యాదుపై కేసును నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

కడప(క్రైం)నవంబరు14(ఆంధ్రజ్యోతి): కడప నగరం మరియాపురం మహిళను బెదిరించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అయన వివరాల మేరకు రాజరెడ్డి వీధికి చెందిన సుజీత్ అలియాస్ బన్ని డబ్బు విషయమై మహిళను గురువారం బెదిరించారని బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గండి గురుకుల పాఠశాలలో రాష్ట్ర క్రీడలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న కర్నూలు గురుకుల పాఠశాలల సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి

చక్రాయపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గండి గురుకుల పాఠశాలలో గురువారం రాష్ట్రస్థాయి జోన్-4 క్రీడలు ప్రారంభమయ్యాయి. కర్నూలు గురుకుల పాఠశాలల సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి కాగడాను వెలిగించి క్రీడలను ప్రారంభించారు. రాష్ట్రంలో దాదాపు 21 గురుకుల పాఠశాలల నుంచి 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడు రోజులు క్రీడలు జరగనున్నాయి. కార్యక్రమంలో చిత్తూరు గురుకుల పాఠశాల సమన్వయకర్త పద్మజ, జూనియర్ కళాశాల ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య, మాజీ స్పోర్ట్స్ అథారిటీ రామచంద్రారెడ్డి, జోన్-4 క్రీడలు సమన్వయకర్త నీలకంఠేశ్వరరావు, ఆర్గనైజర్ కె.ఎల్లారెడ్డి, ఎంపీటీసీ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సహకార పరపతి సంఘాలను బలోపేతం చేయాలి

కడప రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార పరపతి సంఘాలను మరింతగా బలోపేతం చేయాలని డీసీసీ బ్యాంకు ఇన్‌చార్జ్ సీఈఓ రాజామణి పేర్కొన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ కంప్యూటరైజేషన్ ద్వారా వ్యవసాయ సహకార పరపతి సంఘాలను పటిష్టం చేయాలన్నారు. బ్యాంకు సేవలను మరింత సులభతరం చేస్తున్నామని, అన్ని వర్గాల వారికి విరివిగా రుణాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సుభాషిణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన జయంత్యుత్సవాలు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన కర్త పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి 416వ జయంతి మహోత్సవాలు నవంబరు 12 ప్రారంభమై 14న మహా ప్రసాద వినియోగంతో వైభవంగా ముగిసినట్లు ఆలయ ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. గురువారం ఉదయం సుప్రభాతం, పారాయణం, వీరబ్రహ్మేంద్రస్వామికి విశేష హోమాలు, మండల పూజ, శాంతి హోమం. పూర్ణాహుతి చేపట్టారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

కార్తీక సహస్ర దీపార్చన

బ్రహ్మంగారి ఆలయ ప్రాంగణలో సాయంత్రం 6గంటలకు భక్తిశ్రద్ధలతో పూర్వపు మఠాధిపతి కుటుంబసభ్యులు, భక్తులు కార్తీక సహస్ర దీపార్చన చేశారు. కార్యక్రమంలో ఉభయదాతలు ఇడమకంటి జనార్ధన శివాచార్య కుటుంబ సభ్యులు పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు, ఫిట్‌పర్సన్ శంకర్ బాలాజీ మేనేజరు ఈశ్వరాచారి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన చెరుకూరి రవికుమార్



సీఎంతో కలిసిన టీడీపీ నేత రవికుమార్

పోరుమామిళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును బద్వేలు టీడీపీ యువనేత చెరుకూరి రవికుమార్ కలిశారు. గురువారం సచివాలయంలోని ఛాంబరులో కలిసి పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తాను చేసిన సేవలు గుర్తించమని ముఖ్యమంత్రికి తెలిపి తనకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందిం చినట్లు తెలిసింది.

'హైందవ శంఖారావం' విజయవంతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి

సింహాద్రిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) విశ్వహిందూ పరిషత్-ఏపీ ఆధ్వర్యంలో 2025 జనవరి 5న విజయవాడలో జరిగే బహిరంగ సభకు హిందూ బంధువులు లక్షలాదిమంది సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, ఆరెస్సెస్ విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్‌జీ పిలుపునిచ్చారు. వేణుగోపాలస్వామి ఆలయంలో హైందవ శంఖారావం సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తం చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టసవరణ చేయాలని వీహెచ్‌పీ ఒక జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. చట్టసవరణ చేయాలని కోరుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల గవర్నర్లకు సెప్టెంబరు 30న మెమొరాండం ఇచ్చామన్నారు.

పల్లె పండుగ పనులపై దృష్టి సారించాలి

రాయచోటి (కలెక్టరేట్) నవంబరు 14 : పల్లెపండుగ పనులపై దృష్టి సారించి పురోగతి సాధించాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతిరాజ్ ఇంజనీరింగ్ సిబ్బంది, ఎంఈఓలు, ఇతర అధికారులతో పీజీఆర్ఎస్‌లో అందే అర్జీలు, పల్లె పండుగ పనులు, విద్యార్థులకు అపార్ ఐడీల మంజూరు, సర్వే రాళ్లపై బొమ్మలు తొలగించడం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ప్రతి మండలంలో ఆధార్ సెంటర్లను తహసీల్దార్లు తరచూ తనిఖీ చేయాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన పనులను వేగవంతం చేయాలని పంచాయతిరాజ్ అధికారులను ఆదేశించారు. ఎంఈఓలు, ఎంపీడీవోలు సమన్వయంతో పని చేసి విద్యార్థులకు అధార్ ఐడీలను త్వరగా మంజూరు చేయాలన్నారు. సర్వే రాళ్లపై బొమ్మలను తొలగించాలని సర్వే శాఖ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదర్శ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయని వారికి బిల్లుల చెల్లింపు

● కోర్టు ఆర్డర్ బేఖాతరు ● డీఎల్‌పీవో విచారణ

సంబేపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పనులు చేయని వారికి బిల్లులు చెల్లించిన విషయంపై గురువారం ఎంపీడీవో రామచంద్ర సమక్షంలో డీఎల్‌పీవో మస్తాన్‌వలి విచారణ చేశారు. 2017- 18లో శెట్టిపల్లెలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, ఆయన సోదరుడు విష్ణువర్ధన్ రెడ్డి ఉపాధి హామీ పథకం కింద బీటీ రోడ్డు పనులు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులకు సంబంధించి రూ. 68 లక్షలు గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేసింది. ఈ మొత్తాన్ని పనులు చేసిన వారికి కాకుండా వైసీపీకి చెందిన వారికి చెల్లించారంటూ అధికారులకు ఫిర్యాదు అందడంతో డీఎల్‌పీవో గురువారం విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యరమొర్రంపల్లి నుంచి మర్రిమేకుల పల్లె వరకు కోటి రూపాయల విలువైన రోడ్డు ఏర్పాటు పనికి రూ. 27 లక్షలు, చెరుకువాండ్లపల్లె నుంచి వల్లబండపల్లె వరకు కోటి రూపాయల పనికి రూ. 22.50 లక్షలు, నరసారెడ్డిగారిపల్లె నుంచి బలిజ పల్లె వరకు కోటి రూపాయల పనికి రూ.17 లక్షలు, రెడ్డిమల్లువారి పల్లె నుంచి కొత్తపల్లె బిడికి వరకు రూ. 65 లక్షలకు గానూ రూ. 5.50 లక్షలు బిల్లులు పెట్టగా, ఆ మొత్తాన్ని వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదన్నారు. ఈ విషయంపై కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేయడంతోపాటు గ్రామ పంచాయతీ ఖాతాలో జమ అయిన మొత్తాన్ని పనులు చేయకున్నా వైసీపీ నాయకులకు చెల్లించినట్లు ఫిర్యాదు అందడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. విచారణ పూర్తి చేసి నివేదికను పైస్థాయి అధికారులకు పంపనున్నట్లు తెలిపారు ఎంపీడీవో రామచంద్ర, పంచాయతీ సెక్రటరీ రవీంద్ర, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంపీడీవో సమక్షంలో విచారణ చేస్తున్న డీఎల్‌పీవో మస్తాన్‌వలి

రెవెన్యూ రికార్డుల తనిఖీ

చిన్నమండెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చుక్కల భూములు, ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించిన రికార్డులను రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు తనిఖీ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఆయన దాదాపు 720 ఎకరాల భూమికి సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. మండలంలో ఫైళ్ల వెరిఫికేషన్ వేగం పెంచాలని సూచించారు. కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆయా ఫైళ్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో వీఆర్వోను విడివిడిగా పిలిచి చుక్కల భూముల వివరాలు ఆరా తీశారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం 18న సచివాలయం ముట్టడి

రైల్వేకోడూరు, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాలు ఇవ్వాలంటూ ఈ నెల 18న కే. బుడుగుంట పల్లె సచివాలయం ముట్టడిస్తామని సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మొగిలి వినయ్ తెలిపారు. గురువారం సమతానగర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లులేని ప్రతి పేద వాడికి ప్రభుత్వం ఇంటి స్థలంతోపాటు రూ. 5లక్షలు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలు ఇవ్వకుంటే దశలవారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీపీఐ, బీకేఎంయూ నాయకులు బుజ్జమ్మ, సోని, రంగమ్మ, గీతాంజలి, రామాను జయమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ

సిద్దవటం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టక్కోలి రైతుసేవా కేంద్రాన్ని ఏడీఏ నాగరాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు 33 శాతం పైగా నష్టం జరిగిన వరి పైరుకు పరిహారం వర్తిస్తుందన్నారు. కంకులు వాలిపోయి మొలకలు వచ్చి ఉంటే రైతుసేవా కేంద్రం సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర వ్యవసాయ సహాయకుడు ఆకుల వంశీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముదివేడు నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ముదివేడు రిజర్వాయర్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లింపులో కాలయాపన చేస్తూ ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆరోపించారు. మూడేళ్లుగా పలు రూపాల్లో పోరాటం చేసిన రైతులు, గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ముదివేడు నుంచి బైక్ ర్యాలీ చేసి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం రైతులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు, శాఖ కార్యదర్శి హరిశర్మ, మాధవయ్య, నాగబసిరెడ్డి, భాస్కర్, సిద్దిమల్లు రామచంద్ర, ఆంజనేయులు, కిరణ్, రైతులు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో రక్షణ

ఓబులవారిపల్లె: నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్ వ్యాధినుంచి రక్షణ పొందవచ్చని డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని ముక్కావారిపల్లె ప్రభుత్వ ఆసుపత్రి వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో కేన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించి వైద్యం పొందవచ్చునని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని చేరుకున్నపుడే ఉజ్వల భవిష్యత్తు..

● డాక్టర్ మండిపల్లె లక్ష్మీప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉన్నత లక్ష్యాన్ని చేరుకున్నపుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లె లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాబడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు దేశ ప్రధానులు, రాష్ట్రపతులు అయ్యారని, వారిని దృష్టిలో పెట్టుకొని ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలన్నారు..విద్యారంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతన ఒరవడిని తెస్తున్నారని పేదవిద్యార్థులకు పై చదువుల వరకు దోహదపడుతుందని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నిటినీ ప్రభుత్వం నెరవేరుస్తుందని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ మార్చి పిల్లలకు రుచికరమైన భోజనాన్ని అందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, మండల టీడీపీ నాయకుడు యనమల మదన్‌మోహన్, పాఠశాల కమిటీ ఛైర్మన్ యనమల మణి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి విశ్వనాథ, కావలి ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల కడుపు కొడుతున్న ఎంవీఐపై చర్యలు తీసుకోండి

రాయచోటిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపు కొడుతున్న రాయచోటి ఎంవీఐపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా నాయకుడు మావు లూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో మేకలు, గొర్రెలు తదితరాలను కొనుగోలు చేసి ఆటోల్లో పట్టణానికి తరలించి విక్రయిస్తూ జీవిస్తున్న పేదలను ఆయన ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వాహనాల రికార్డులు సక్రమంగా ఉన్నా.. కేసులు నమోదు చేస్తూ, జరిమానాలు వసూలు చేస్తూ పేదల కడుపు కొడుతున్నాడన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు బాలు, బాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇసుక వివాదం

సిద్దవటం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లె పెన్నానది నుంచి గృహ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక తరలించకుండా స్థానికులు రహదారికి అడ్డంగా గోతులు తీయడంతో ఏర్పడిన సమస్య అధికారుల చొరవతో పరిష్కారమైంది. గురువారం మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత ఆదేశాలతో వాహనాలు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా తీసిన గోతులను కూలీల సాయంతో అధికారులు పూడ్చి వేయించారు. ఈ సందర్భంగా వీర్వో కేశవులు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో గృహ నిర్మాణాలకు ఉచితంగా తీసుకెళ్లవచ్చని, పెన్నానదిలో ఉన్న నీటి పంపింగ్ స్కీం వద్ద ఇసుక తవ్వకూడదని, తెలిపారు. నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే తవ్వకాలు జరపాలని, అందుకోసం ఎక్స్‌కవేటర్ వంటి యంత్రాలు ఉపయోగించరాదని ఆయన సూచించారు.



ఇసుక తవ్వకాలకు కేటాయించిన ప్రాంతాన్ని చూపుతున్న వీఆర్వో కేశవులు

పరమ పవిత్రం కార్తీకం

రాజంపేట, నవంబరు 14 : అన్ని మాసాల్లో పవిత్రమైనది కార్తీకమాసమని హిందూధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని మందరం రాచపల్లిలోని ఉమా మహేశ్వర దేవస్థానంలో గురువారం ఆయన కార్తీక మాస ప్రాశస్త్యం అనే అంశంపై ధార్మికోపన్యాసం చేశారు. అనంతరం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అసిస్టెంట్ గోపి బాబు, ఆలయ ధర్మకర్త ఉమాపతి, సుజాత, గ్రామ పెద్దలు శంకర్‌రాజు, కృష్ణయ్య, మల్లికార్జున ఆచారి, చంద్ర, జయచంద్రరాజు, నర్సారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల రోడ్డుకు మోక్షం

గాలివీడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూలివీడులో 30 ఏళ్ల క్రితం ప్రభుత్వ వైద్యశాల నిర్మించినా, ఇప్పటి వరకు అక్కడికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. ఈ విషయం గుర్తించిన మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి సమస్యను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సిమెంటు రోడ్డు ఏర్పాటుకు ఆరు లక్షల రూపాయలు మంజూరు చేయించారు. మాజీ సర్పంచ్ ఫరీద్ బాషా ఈ పనులు పూర్తి చేశారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పూర్తయిన సిమెంటు రోడ్డు

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

సిద్దవటం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాకరాపేట, బెటాలియన్ తదితర ప్రాంతాల్లో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య మాట్లాడుతూ మండలంలో పెద్దఎత్తున స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారని తెలిపారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన వాగ్దానాలన్నీ అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో ఆయనకు ఎవరూ సాటిరారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. నాయకులు పుత్తా బాలయ్య, బీసీ నాయకులు శివశంకర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

18న ఎస్‌ఎఫ్‌ఐ చలో విజయవాడ

రాయచోటిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాయచోటి పట్టణ అధ్యక్షుడు సాయి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని డైట్ స్కూల్ ఆవరణలో మహాధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు విడు దల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీల పెంపు, అధ్యాపక పోస్టుల భర్తీ తదితర డిమాండ్ల పరిష్కారం కోసం నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్ నాయుడు, గురునాథ్, శివాజీ, సన్ని, నరసింహ, తిరుమలనాయుడు, నాగేంద్ర, అమర్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కూలీలకు వరం

సంక్షేమ చట్టం

- ఈ చట్టంతో కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు
- అవగాహన లేమితో దూరంగా కార్మికులు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న కార్మిక శాఖ

పీలేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మిక రంగంలో భవన నిర్మాణ రంగానిదే అగ్ర తాంబూలం. ఉన్న చోటనే లేక సమీప ప్రాంతంలోనే భుక్తి మార్గం కల్పించడంలో భవన నిర్మాణ రంగానిది ప్రత్యేకత. అందుకనే చాలామంది రైతులు, రైతు కూలీలు, సాధారణ కూలీలు తమ సంప్రదాయ వృత్తులను వదిలి భవన నిర్మాణ రంగంలోకి వెళుతుంటారు. నైపుణ్యం, అనుభవం, నేర్పరితనాన్ని బట్టి నిర్మాణ రంగంలో వేతనాలు ఉంటుంటాయి. శారీరకంగా ధృడంగా ఉన్నన్నాళ్లు ఎటువంటి రిటైర్మెంట్ లేకుండా పనిచేసుకునే అనువైనది నిర్మాణం రంగం. అయితే నిత్యం ప్రమాదపు అంచుల్లో పనిచేసే ఆ రంగంలోని తాపీమేస్త్రీలు, కూలీలకు రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే ఉంటుంటాయి. నిత్యం ఎక్కడో ఒకచోట భవన నిర్మాణ రంగ కూలీలు మృత్యువాతపడుతూనే ఉంటారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా మేస్త్రీలు, గృహ యజమానులు అందించే కాసింత పరిహారంతోనే ప్రమాదానికి గురైన వారు సరిపుచ్చుకుంటూ ఉంటారు. ఇక ప్రమాదాల కారణంగా అంగవైకల్యం పొందిన వారైతే చేసేది లేక ఇంటి పట్టునే ఉంటూ నిరాశతో జీవితం గడుపుతూ ఉంటారు. నిర్మాణ రంగంలోని ఇటువంటి ఇబ్బందులను తొలగించి మేస్త్రీలు, కూలీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మిక సంక్షేమ చట్టం 1996, ఆంధ్రప్రదేశ్ నిబంధనలు-1999ను అమలు చేస్తున్నాయి. కేవలం నామమాత్రపు రుసుంతో కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకున్న వారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తూ వారికి ఆదరవుగా నిలుస్తోంది సంక్షేమ చట్టం. భవన నిర్మాణ రంగంలోని ఏ విభాగంలోని వారైనా సంక్షేమ చట్టంలోని ప్రయోజనాలను పొందేందుకు అర్హులేనని, వారు చేయాల్సిందల్లా కేవలం కార్మిక శాఖ వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవడం మాత్రమేనని చెబుతోంది ఈ చట్టం.

నమోదుకు కావాల్సిన అర్హతలు

- 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న భవన నిర్మాణ కార్మికులు అర్హులు.
- వయస్సు ధృవీకరణ కోసం రేషన్ కార్డు, ఓటరు కార్డు, జనన లేక స్కూలు సర్టిఫికెట్ జిరాక్స్ పత్రాలు అందజేయాలి.
- నమోదు చేసుకోవాల్సిన రోజుకంటే ముందు 90 రోజులకు తగ్గకుండా నిర్మాణ రంగంలో పనిచేయాల్సిన అనుభవం కలిగి ఉండాలి.
- నమోదుకు రూ.110 (రూ.50+రూ.60) చెల్లించి సంబంధిత కార్మిక శాఖాధికారి ద్వారా 5 సంవత్సరాలకు ఒకేసారి నమోదు చేయించుకోవచ్చు. తరువాత రూ.60 చెల్లించి 5 ఏళ్లకు ఒకేసారి రెన్యువల్ చేయించుకోవచ్చు.

సంక్షేమ బోర్డు ద్వారా లభించే ప్రయోజనాలు

- పనిచేసే ప్రదేశాల్లో మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షల పరిహారం
- 50 శాతం లేదా అంతకు మించి అంగవైకల్యం పొందిన వారికి రూ.లక్ష పరిహారం.
- 26 శాతం నుంచి 49 శాతం వరకు అంగవైకల్యం కలిగిన వారికి రూ.50 వేలు పరిహారం.
- 25 శాతం వరకు అంగవైకల్యం పొందిన వారికి రూ.25 వేలు పరిహారం.
- సాధారణ మరణం పొందిన వారికి రూ.60 వేల ఆర్థిక సాయం.
- కార్మికుడి భార్యకు రెండు కాన్పులకు రూ.20 వేల ప్రసూతి సాయం లభిస్తుంది.
- భవన నిర్మాణ కార్మికులకు అనారోగ్య సమయంలో రోజుకు రూ.300 చొప్పున నెలకు రూ.3 వేలకు మించకుండా మూడు నెలల వరకు చెల్లిస్తారు.
- అంతిమ సంస్కార ఖర్చులకు రూ.20 వేలు చెల్లిస్తారు.
- జాతీయ నిర్మాణ శిక్షణ సంస్థ(న్యాక్) ద్వారా కార్మికులకు ఎలక్ట్రికల్, తాపీ పని, ప్లంబింగ్, పెయింటింగ్, బార్ బెండింగ్, వడ్రంగి విభాగాలలో రోజుకు రూ.300 శిక్షణ భృతి చెల్లిస్తూ ఉచిత, భోజన, వసతి సౌకర్యాలతో శిక్షణ అందిస్తారు.
- ఏ పింఛను పథకం కింద సభ్యులుగా నమోదు కాని వారికి జాతీయ పింఛను పథకంలో లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారు.
- బోర్డు ద్వారా గుర్తింపు కార్డు పొందిన అవివాహితులైన మహిళా కార్మికులు, లబ్ధిదారులైన కార్మికుల కుమార్తెలకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని వివాహ కానుకగా అందిస్తారు.
- కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డు పొందని కార్మికులు కూడా ప్రమాదంలో మరణిస్తే రూ.50 వేలు లేదా ప్రమాదం జరిగితే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరక ఆర్థిక సాయం అందిస్తారు.

విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం...



కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు పొందిన వారికి లభించే ప్రయోజనాల గురించి కార్మికుల్లో విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నాం. అవగాహన లేమి, నిరక్షరాస్యత కారణంగా చాలా మంది ఈ పథకానికి దూరంగా ఉంటున్నారు. పీలేరు కార్యాలయం పరిధిలోని పీలేరు, కేవీపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, ఐరాల, తవణంపల్లె, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళం, పాకాల మండలాల నుంచి 2009 నుంచి 2024 వరకు 14,661 కార్మికులు నమోదు చేసుకున్నారు. వారిలో కేవలం 60 శాతం మంది మాత్రమే రెన్యువల్ చేసుకున్నారు. వారందరినీ గుర్తించి వారు కూడా రెన్యువల్ చేయించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాం. తమ దగ్గర పనిచేసే కార్మికులను తాపీ మేస్త్రీలు విధిగా కార్మిక శాఖ వద్ద నమోదు చేయించాలి. అప్పుడే ఈ పథకం అందరికీ అందుతుంది.

- ఆనంద్, సహాయ కార్మిక శాఖాధికారి, పీలేరు



పీలేరులో భవన నిర్మాణంలో కార్మికులు

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

వాల్మీకిపురం, నవంబరు 14: సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని అలా కాదని నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో చుక్కల భూముల రీవెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, చుక్కల భూముల సమస్యలు, రెవెన్యూ సేవల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎప్పటికప్పుడు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్, అపార్ కార్యక్రమాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మండలంలో ఎక్కడా రెవెన్యూ సమస్యలు ఉండకూడదని ఆ దిశగా అధికారులు పనిచేయాలన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన లేఔట్లలో కాలనీ నివాసాల అమ్మకాలు, కొనుగోలు చేసినా ప్రభుత్వ చ ర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి శాఖకు చెందిన అధికారులు కూడా తమ వి ధుల విషయంలో నిర్లక్ష్యం చూపక ప్రజలకు సేవలందించాలన్నారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రం, రోడ్లు పరిశీలన

వాల్మీకిపురం మండలంలోని నాలుగవ అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కేంద్రంలో పరిధిలో ఉన్న పిల్లలు, రోజువారీ హాజరు తదితర వివరాలను ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం జర్రావారిపల్లె, చింతలవారిపల్లె గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మదనపల్లె ఆర్డీవో రాఘవేంద్ర, డ్వామా పీడీ వెంకటరత్నం, డీఎల్డీవో ఆనందరెడ్డి, హౌసింగ్ ఈఈ నీలకంఠదాస్, ఏపీడీ శ్రీనివాసులు, పీఆర్ డీఈ మధు, తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీవో మనోహర్‌రాజు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ ఫలాలు అందాలనే పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మదనపల్లె అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగలకు అందాలనే పోరాటం చేస్తున్నామని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం మదనపల్లె పట్టణం, చౌడేశ్వరీ కల్యాణ మండపంలో నిర్వహించిన చిత్తూరు ఉమ్మడి జిల్లా మాదిగల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మాదిగల ఎస్సీ వర్గీకరణతో పాటు సమాజం కోసం పోరాటాలు, ఆందోళనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరణ చేస్తే మాదిగలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారని చెప్పారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వేషన్ కోసం 59 కులాలు పోరాటాలు చేస్తుంటే మాలలు ఒక కులం మాత్రం వ్యతిరేకించడం దారుణమన్నారు. దశాబ్దాల పోరాటాల ఫలితమే ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ సాధించామన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వానికి అన్ని విధాలుగా మాదిగలు పూర్తి సహకారం అందించినప్పటికీ జగన్ మాత్రం ఐదేళ్లలో ఐదు నిమిషాలు కూడా ఎస్సీ వర్గీకరణ గురించి మాట్లాడలేదని అన్నారు. చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణకు సహకారం అందించారని చెప్పారు. మాదిగల గురించి పట్టించుకోని జగన్‌కు మద్దతుగా ఉండాలా, లేదా మాదిగలకు అన్ని విధాల సహకారం ఇస్తున్న నారాచంద్రబాబుకు మద్దతుగా ఉండాలా అని మాదిగలు నిర్ణయం తీసుకోవాలన్నారు. ముందుగా వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మౌలాలీ ఆధ్వర్యంలో మందకృష్ణమాదిగను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకులు నరేంద్రబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర(రవి), ఎంఎస్‌పీ నియోజకవర్గ నాయకులు ఆరేటి వాసు, పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు వేగవంతం

- రాయచోటి ఆర్డీవో సహా మరో ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లకు నోటీసులు
- నలుగురు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు...
- ఐదుగురు టౌన్ ప్లానింగ్ అధికారులు... ఎంపీడీవోకూ నోటీసులు

కడప/కలికిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప కేసీ కెనాల్‌కు చెందిన భూముల ఆక్రమణలకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన 20 మంది అధికారులను బాధ్యులుగా చేస్తూ గత నెల 30వ తేదీన వారందరికీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి వారి సంజాయిషీలను పేర్కొంటూ 10 రోజుల్లోగా జవాబివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. గడువు ముగిసిన వెంటనే వారు సమర్పించిన సంజాయిషీలతో సంతృప్తి చెందని ప్రభుత్వం తాజాగా ఒక్కొక్కరికీ విడివిడిగా మరోసారి చార్జిషీట్లను జారీ చేసింది. అభియోగాల్లోని అంశాల వారీగా వివరణలు అందజేసేందుకు నిబంధనల ప్రకారం మరోసారి ఈ నోటీసులు జారీ చేసింది.

ఈ దఫా జారీ అయిన వారిలో ప్రస్తుత రాయచోటి ఆర్డీవో ఎ.శ్రీనివాస్‌తో సహా ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లు, నలుగురు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, ఐదుగురు టౌన్ ప్లానింగ్ అధికారులు కాగా మరొకరు చిట్వేలిలో పనిచేసిన ఎంపీడీవో ఉన్నారు. ఈసారి 13 మందికి మాత్రం ఈ నోటీసులు జారీ కాగా వారందరికీ గతంలో వలే కలిపి కాకుండా విడివిడిగానే వేర్వేరుగా జీవోలు జారీ చేసింది. బుధవారం రాత్రి ఈ మేరకు జీవోలు విడుదలయ్యాయి.

కేసీ కెనాల్ ఆక్రమణల వ్యవహారమేంటి?

కేసీ కెనాల్ భూములు ఆక్రమించిన తీరు గురించి తాజాగా జారీ అయిన నోటీసుల్లో ప్రభుత్వం కూలంకషంగా వివరించింది. కడప కేసీ కెనాల్‌కు సంబంధించిన కాలువ పక్కన వున్న గూడూరు గ్రామానికి చెందిన పలు సర్వే నెంబర్లలోని కాలువ కట్ట పొరంబోకు భూముల్లో 7.76 ఎకరాలను ఆక్రమించి రియల్ ఎస్టేట్ మాఫియా వెంచర్లు వేసింది. దీని కోసం కొత్త రామరాజుపల్లె వద్ద కేసీ కెనాల్ సైఫన్‌ను కూడా కూల్చేసి సిమెంటు రోడ్లు వేశారు. ఇక్కడ విజయదుర్గ కాలనీ పేరుతో ఇళ్ల స్థలాలను అభివృద్ధి చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు 2004 జూలైలో ఈ ఆక్రమణలు మొదలు పెట్టారు. ఆక్రమణలను అడ్డుకోవడంలోనూ, ఇండ్ల స్థలాల అభివృద్ధిని నిరోధించడంలోనూ, ప్లాట్లను యథేచ్ఛగా అమ్ముతున్నా అడ్డుకోవడంలోనూ జలవనరుల శాఖ, కడప మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. కాలువ భూముల ఆయకట్టుకు సంబంధించిన షైదుకూరుకు చెందిన కొంతమంది రైతులు, కడప బీజేపీ నాయకుడు ఎల్.రామమోహన్ రెడ్డి చివరికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ శాఖ అధికారులు కేసీ కెనాల్ భూముల ఆక్రమణ, విజయదుర్గ లేఔట్ ఏర్పాటు, అధికారుల సహకారం తదితర అంశాల్లో లోతుగా విచారణ చేసి వాస్తవాలను ప్రభుత్వానికి నివేదించింది. అయితే ఈ వ్యవహారం 2014 వరకూ ఎక్కడికక్కడే నిలిచిపోయింది.

ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం దీనిని తిరిగి లోతుగా పరిశీలించేందుకు చర్యలు తీసుకుంది. అన్ని అడ్డంకులు అధిగమించి విచారణ, తదుపరి చర్యలపై కార్యాచరణ ఒక కొలిక్కి వస్తున్న దశలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఆ తరువాత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇది పూర్తిగా తెరమరుగైంది, తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కేసీ కెనాల్ ఆక్రమణల బాగోతం వెలుగులోకి వచ్చింది.

బాధ్యులైన అధికారులు..

కేసీ కెనాల్ భూముల ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారంలో రెవెన్యూ శాఖకు సంబంధించి అప్పటి కడప మండల తహసీల్దార్లుగా పనిచేసిన ఎల్.రవిశంకర్‌రెడ్డి (ప్రస్తుతం యూత్ వెల్ఫేర్ ఆఫీసర్, అనంతపురం), ఎస్.ప్రేమనాథ కుమార్ (జనరల్ మేనేజర్, ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్, విజయవాడ), ఎ.శ్రీనివాస్ (ఆర్‌డీవో, రాయచోటి), మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లుగా పనిచేసిన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి (డిప్యూటీ కమిషనర్, తిరుపతి), సి.ఓబులేశు, (కమిషనర్, శ్రీకాకుళం), డి.జన్‌శామ్‌సన్ (తెలంగాణా రాష్ట్రం), ఎస్.అలీమ్ బాషాలున్నారు.

ఇక కార్పొరేషన్ ఉద్యోగులు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ టీసీ కృష్ణ సింగ్ (డీటీసీపీ, కడప), టీపీబీవో జి.శారదాంబ, (టీపీఎస్, తిరుపతి), టీపీబీవో జి.నాగశివప్రసాద్ (టౌన్ ప్లానింగ్ ట్రేసర్, కడప), టీపీబీవో టి.ఎం.రెహ్మాన్ (టీపీవో, హిందూపురం), టీపీఎస్ బి.విజయభాస్కర్ (ప్లానింగ్ ఆఫీసర్, కర్నూలు పట్టణాభివృద్ధి సంస్థ), గూడూరు పంచాయతీ కార్యదర్శి ఎన్.శివరామి రెడ్డి (ఎంపీడీవో, చిట్వేలి తాజాగా గడివేముల కర్నూలు)లు ఉన్నారు. కాగా గత నెల 30వ తేదీన జారీ చేసిన అభియోగ పత్రంలో పోలీసు శాఖ నుంచి ఒక డీఎస్పీ, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, జలవనరుల శాఖకు సంబంధించి నలుగురు ఈఈలు కూడా ఉన్నారు. ప్రస్తుతానికి వీరికి మాత్రం ఎలాంటి నోటీసులు జారీ కాలేదు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరి అరెస్ట్

పెనగలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చెక్ బౌన్స్ కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జి.రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ప్రకాశం జిల్లా లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన పోలు మోహన్ అనే వ్యక్తికి చెక్‌బౌన్స్ కేసులో నందలూరు కోర్టు ఏడాది జైలుశిక్ష విధించింది. అయితే, అతను శిక్ష అనుభవించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బెంగళూరులో ఉంటున్న మోహన్‌ను అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరు పెట్టినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో కానిస్టేబుల్ రామరాజు, కోర్టు కానిస్టేబుల్ శివనాగేంద్ర సహకారం అందించారని తెలిపారు.

పోసానిపై టీడీపీ నేతల ఫిర్యాదు


రాజంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా సోషల్ మీడియాలో తీవ్ర పదజాలంతో దూషించిన పోసాని కృష్ణమురళిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు కోవూరు సుబ్రమణ్యంనాయుడు, అబుబకర్ గురువారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోషల్‌మీడియాను దుర్వినియోగం చేస్తూ పోసాని చేసిన వ్యాఖ్యల వివరాలున్న పెన్‌డ్రైవ్‌ను ఎస్ఐకి అందజేశారు. కార్యక్రమంలో శవనవారిపల్లె సర్పంచ్ కోటయ్యనాయుడు, గ్రామీణ ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, పట్టణ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే కరీం, టీడీపీ నాయకులు పాండురాజు, గుణశంకర్ పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో జాతీయస్థాయికి ఎంపిక

ఓబులవారిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నఓరంపాడు జడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థినులు భాను, సారా జాతీయ స్థాయి టెన్నిస్ క్రికెట్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. అక్టోబరులో చెన్నైలోని విల్లుపురంలో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు మొదటి స్థానం సాధించడంలో వారు కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి జమ్ము కశ్మీర్‌లోని జమ్మూతావిలో జరగబోయే పోటీల్లో వారు పాల్గొంటారన్నారు.

వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీగా శశిధర్‌రెడ్డి

కలికిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం (డీఆర్సీ) సహాయ సంచాలకులుగా ఆర్. శశిధర్‌రెడ్డిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో గ్రామీణాభివృద్ధి శాఖకు డిప్యుటేషన్‌పై వెళ్లిన శశిధర్‌రెడ్డిని గత నెల 23న తిరిగి మాతృ సంస్థ వ్యవసాయ శాఖకు పంపించారు. దీంతో ఆయనను జిల్లా వనరుల కేంద్రం రాయచోటిలో ఏడీగా నియమిస్తూ గురువారం వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ ఆదేశాలు జారీ చేశారు.



ఎగుమతి చేసేందుకు క్రేట్లలో పేర్చిన దానిమ్మ కాయలు

నష్టాల...దానిమ్మ

- కుప్పకూలిన ధర... కేజీ రూ.200 నుంచి రూ.50కి
- సైజు లేకుంటే రూ.30...
- దిక్కుతోచని స్థితిలో దానిమ్మ రైతులు
- నష్టాలతో రైతన్నలు ఉక్కిరిబిక్కిరి

ములకలచెరువు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు చివరకు నష్టాలే మిగులుతున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న దానిమ్మ పంట రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. బయటి మార్కెట్‌లో దానిమ్మ ధరలు కుప్పకూలిపోయాయి. కేజీ రూ.200 నుంచి రూ.50కు పడిపోయింది. కాయలు సైజు లేకుంటే కేజీ రూ.30కే అడుగుతున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధర మాత్రం పతనమైంది. ఇటీవల తుఫాను కారణంగా వచ్చిన వర్షాలు దానిమ్మ తోటలను దెబ్బతీశాయి. అధిక శాతం కాయలపై మచ్చలు వచ్చాయి. దీంతో దానిమ్మ రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



మచ్చలు వచ్చిన దానిమ్మ కాయలు

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో దానిమ్మ దిగుబడి పెరగడం, ఇక్కడి కాయలకు మచ్చలు రావడంతో ధరలు పడిపోవడానికి కారణమైంది.

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె మండలాల్లో సుమారు 300 ఎకరాల్లో దానిమ్మ తోటలు సాగులో ఉన్నాయి. డ్రిప్ ఇరిగేషన్ కింద తోటలు సాగు చేశారు. ఎకరా దానిమ్మ సాగుకు రూ.1.50 లక్షల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం దానిమ్మ తోటలు దిగుబడి వస్తున్నాయి. కాయలు కూడా విరగ్గాశాయి. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా కాయలపై మచ్చలు వచ్చాయి. గత నెలలో తుఫాను కారణంగా కురిసిన వర్షానికి అధిక శాతం కాయలపై మచ్చలు ఏర్పడ్డాయి. దీనికి తోడు ప్రస్తుతం కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కూడా దానిమ్మ దిగుబడులు అధికంగా వస్తుండడంతో అక్కడి కాయలపై మచ్చలు లేని కారణంగా ఇక్కడి కాయలకు డిమాండ్ తగ్గింది.

20 రోజుల క్రితం వ్యాపారస్తులు తోటల వద్దకు వచ్చి కేజీ రూ.200తో కొనుగోలు చేశారు. ప్రస్తుతం కేజీ రూ.50కి అడుగుతున్నారు. కాయలపై మచ్చలు అధికంగా ఉండడంతో 150 గ్రాములు ఉన్న కాయలను మాత్రం కేజీ రూ.50తో కొనుగోలు చేశారు. 150 గ్రాముల కంటే తక్కువ పరిమాణం ఉన్న కాయలను కేజీ రూ.30తో అడిగారు. బుధవారం కాయలను కోత చేసి క్రేట్లలో పేర్చి కాయలను తమిళనాడు రాష్ట్రం చెన్నైకి వాపారస్తులు తీసుకెళ్లారు. ఆరు ఎకరాలకు 20 టన్నుల దిగుబడి వచ్చినా ధర లేకపోవడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. పంట నోటికాడికి వచ్చే సమయంలో ధరలు పతనం కావడంతో దానిమ్మ రైతులు మదనపడుతున్నారు.

నీటి తడులు తక్కువ... పెట్టుబడులు ఎక్కువ

రాజస్థాన్ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం ఉంటుంది. ఆ ప్రాంతంలో రైతులు దానిమ్మ సాగు చేసి అధిక లాభాలు గడించారు. ఇక్కడ కూడా భూగర్భజలాలు అంతంతమాత్రంగా ఉండడంతో డ్రిప్ పద్ధతిలో తక్కువ నీటితో పండించే పంటలపై రైతులు మొగ్గు చూపారు. పడమటి మండలాల్లో దానిమ్మ తోటలను విస్తారంగా సాగు చేశారు. అధిక ధరలు వెచ్చించి మందులు పిచికారీ చేసినా తెగుళ్లు, బ్యాక్టీరియా నివారణ చేయలేకపోతున్నారు. దీనికి తోడు ప్రతి ఏటా తుఫాన్ల కారణంగా కురుస్తున్న వర్షాలకు కాయలపై మచ్చలు ఏర్పడుతున్నాయి. దానిమ్మ సాగుకు పెట్టుబడి కూడా ఎక్కువే. మొక్కలు, ఎరువులు, కూలీల ఖర్చు, మొక్కలు నాటడానికి, డ్రిప్ తదితర వాటికి మొదటి ఏడాది ఎకరాకు రూ.1.50 లక్ష ఖర్చు వస్తోంది. రెండవ ఏడాది రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఒకసారి తోట సాగు చేస్తే పదేళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

మచ్చలతో తీవ్ర నష్టం

- కిరణ్‌కుమార్, రైతు, గూడుపల్లె

నేను ఆరెకరాల్లో దానిమ్మ సాగు చేశాను. గత నెలలో కురిసిన తుఫాను కారణంగా కాయలకు మచ్చలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ధరలు కూడా పతనమయ్యాయి. 20 రోజుల క్రితం వరకు కేజీ రూ.200 ఉండేది. ప్రస్తుతం రూ.50కు చేరింది. దీంతో తీవ్రనష్టం వచ్చింది.



గూడుపల్లె సమీపంలో ఉన్న దానిమ్మ తోట

జిల్లాలో కరవు మండలాలు లేవా ?

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్



మాట్లాడుతున్న సీపీఎం నేత గఫూర్

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో 54 కరువు మండలాలు ప్రకటిస్తే కనీసం కడప జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా మీకు కనబడలేదా అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏగఫూర్ ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో భారం మోపడం సరికాదని ఆయన మండిపడ్డారు. మరో పక్క విద్యుత్ స్మార్ట్‌మీటర్లు రద్దు కోసం సమరశీల పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. నిధులు నికర జలాలు, విభజన హామీలు అమలు సమగ్రాభివృద్ధి కోసం జిల్లా పట్ల వివక్ష విడనాడాలన్నారు. మహాధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శి వర్గసభ్యులు దస్తగిరిరెడ్డి, సత్యం, శ్రీనివాసులరెడ్డి, అన్వేష్, నగర నేతలు చంద్రారెడ్డి, బద్వేలు నుంచి చాంద్‌బాషా, వెంకటేశ్, ఒంటిమిట్ట నుంచి నరసయ్య, జమ్మలమడుగు నుంచి యేసుదాసు, విజయ్, శివనారాయణతో వివిధ మండలాల నుంచి పెద్దఎత్తున పార్టీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రారు పద్మ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైవీయూ డిగ్రీ ఎల్ఎల్‌బీ సెమిస్టరు పరీక్ష ఫలితాలను ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, సహాయ నియంత్రణాధికారి డాక్టర్ శ్రీనివాసరావు విడుదల చేశారు. చాంబరులో ఫలితాలపై మాట్లాడుతూ ఎల్ఎల్‌బీ ఐదేళ్ల రెండో సెమిస్టరులో 113 మంది హాజరుకాగా, 67 మంది (59శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. 4వ సెమిస్టరులో 87మందికి 9 మంది (10శాతం) ఉత్తీర్ణులయ్యారన్నారు. 6వ సెమిస్టరులో 79మందికి 59మంది (74శాతం), 8వ సెమిస్టరులో 73 మందికి 53 మంది (72శాతం) 10వసెమిస్టరులో 122 మందికి 108మంది (88శాతం) ఉత్తీర్ణతసాధించారన్నారు.

డిగ్రీ పరీక్ష ఫలితాల్లో

డిగ్రీపరీక్షలకు సంబంధించి బీఏ 7వసెమిస్టరు ఫలితాల్లో 93 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బీబీఏ వంద శాతం, బీకాం వంద శాతం, బీఎస్సీ 99 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారన్నారు. బీఏ 8వ సెమిస్టరు పరీక్షల్లో 97శాతం, బీబీఏ 93 శాతం, బీకాం వంద శాతం, బీఎస్సీ 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.

పెద్ద దర్గా ఉరుసును దిగ్విజయం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న దర్గా ప్రతినిధులు

కడప కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడపలో వెలసిన ప్రఖ్యాత పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 16వ తేదీ శనివారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా ఉత్సవాలను దిగ్విజయం చేసేందుకు తప్పక హాజరవాలని దర్గా ప్రతినిధులు అమీర్, కుతుబుద్దీన్ కోరారు. పెద్దదర్గాలో వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు మలంగ్‌షా సర్‌గిరీలు, ఫకీర్లు బాదుల్లా సాహెబ్ మకాన్‌వద్దకు చేరుకుని చదివింపులు చేస్తారన్నారు. తదుపరి ఊరేగింపుగా దర్గా చేరుకుంటుందన్నారు. రాత్రి 9 గంటలకు ఖవ్వాలి, 10 గంటలకు పీఠాధిపతి నివాసం నుంచి గంధం ఊరేగింపుగా దర్గాచేరుకుని, ఫాతేహా చేసి గంధము సమర్పించనున్నట్లు వెల్లడించారు. 17న సాయంత్రం ఇదారా-యే-అమీనియా చిష్తియా వార్షిక నివేదిక సమర్పణ, ఉరుసు ఉత్సవం వేడుకగా జరుగనుందన్నారు. 18న సాయంత్రం 5 గంటలకు పీఠాధిపతి మహానైవేద్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 19న విద్వాంసులచే రాత్రి 10 గంటల నుంచి ఖవ్వాలి వుంటుందన్నారు. 20న పీఠాధిపతి శిష్యులతో కలిసి హాజరత్ మస్తాన్ స్వామి తపస్సు చేసిన శ్రీ శేషాచల పర్వతంలోని గుహ వద్ద జెండా ప్రతిష్ఠ చేయనున్నారన్నారు.

ఘనంగా సానపురెడ్డి ఓబులమ్మ వర్ధంతి

చిన్నారులకు దుప్పట్లు పంపిణీ



సానపురెడ్డి ఓబులమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న రాంగోపాల్ రెడ్డి, తదితరులు

బద్వేలు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బోడిశ్లవారిపల్లె వాసులు సానపురెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాధాక్రిష్ణరెడ్డి మృత్యుమూర్తి సానపురెడ్డి నాగ ఓబులమ్మ 2వ వర్ధంతి నిర్వహించారు. ఆమె కుమారులు సానపురెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాధాక్రిష్ణరెడ్డి సహకారంతో గురువారం సిద్దవటం రోడ్డులోని షాలోమ్ అనాధ శరణాలయం చిన్నారులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు, మధ్యాహ్న భోజనం అందించారు. మున్సిపల్ ఛైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి వీటిని పంపిణీ చేశారు. అనాధ శరణాలయంలో నాగ ఓబులమ్మ చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నేతలు నివాళులర్పించారు. నాగ ఓబులమ్మ భర్త గోపాల్‌రెడ్డి పట్టణంలో అందరికీ సుపరిచితులు కావడంతో ఈ కార్యక్రమానికి పలువురు హాజరై నివాళులర్పించారు.

ఉల్లి విత్తనాల వ్యాపారిపై కేసు నమోదు చేయాలి

కల్తీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు



పొలాల్లోనే వదిలేసిన ఉల్లిపంటను చూపుతున్న రైతు

వీరపునాయునిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కల్తీ ఉల్లి విత్తనాలు అమ్మి రైతులను మోసగించిన వ్యాపారి షైదుకూరు గురవయ్యపై కేసు నమోదు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కొమ్మద్ది గ్రామంలో చాలా మంది రైతులు కల్తీ ఉల్లి విత్తనాలు చల్లి దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారని రైతులు కె.ఈశ్వరయ్య, రామాంజనేయులు, పోతులయ్య, విశ్వనాథ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పదెకరాల్లో కల్తీ విత్తనాలతో రైతులు నష్టపోయారని వారు తెలిపారు. జూలైలో గురవయ్య దగ్గర సేరు ఉల్లి విత్తనాలు రూ.1400తో కొనుగోలు చేశామన్నారు. పంటను కాపాడుకున్నా చివరకు ఉల్లి గడ్డలు ఊర లేదన్నారు. ఎకరా సాగుకు రూ.70వేలు పెట్టుడులు పెట్టామన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

హైవే భూ సేకరణ పనులు పరిశీలించిన జేసీ



మ్యాపును పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

ప్రొద్దుటూరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి - వేంపల్లే హైవే నిర్మాణం కోసం భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. గురువారం ఆమె ప్రొద్దుటూరులోని నేషనల్ హైవే కోసం పోయే భూ ములను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గోపవరం పంచాయతీ ప్రొద్దుటూరు కొత్తపల్లె నంగనూరు పల్లె పొలాల్లో 42.328 ఎకరాలు భూసేకరణ చేపట్టాల్సివుందన్నారు. వీటి సర్వే నెంబర్లు భూరికార్డులు పరిశీలించారు. పరిశీలనలో తహసీల్దారు గంగయ్య ఆర్‌ఐ నాగమోహన్ రెడ్డి సర్వేయర్ వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా 'నాడు - నేడు'



అసంపూర్తిగా ఉన్న భవనం

కలగా మారిన ఇంటర్ భవన నిర్మాణాలు ● ఇబ్బందుల్లో విద్యార్థినులు

భవనాల కోసం తప్పని ఎదురుచూపులు ● ఇప్పటికైనా పూర్తి అయ్యేనా

వీరబల్లి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగానే జరిగాయి. 'నాడు - నేడు' పథకంలో భాగంగా ప్రతి పాఠశాలనూ అభివృద్ధి చేద్దామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా పనులు ప్రారంభించింది. ఈ పథకం అస్మదీయులకు లబ్ధిచేకూరేందుకే ఏర్పాటు చేసినట్లుగా తయారైంది. వీటి పనులు కూడా వారికే కట్టబెట్టడంతో వారు చేసేదే పని, ఎప్పుడు పూర్తవుతాయో అడగకూడని పరిస్థితి. మంజూరైన వాటిలో కొన్నింటిని పూర్తి చేసినా నిరుపయోగంగా ఉండడం, మరికొన్ని అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇందులో భాగంగా కస్తూర్బా జూనియర్ కళాశాల భవనాలు నిధుల్లేక అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఇంటర్ విద్యార్థినుల కోసం భవనాలు లేకపోవడం చేపట్టక పోవడంతో భవనిర్మాణాలు జరిగేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై స్థానికులు, విద్యార్థినుల తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకెళితే...

స్థానిక కస్తూర్బా పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉండడంతో పంచాయతీల్లోని విద్యార్థులే కాకుండా బయటి ప్రాంతాల నుంచి అనేక మంది విద్యార్థినులు ఇక్కడ 6వ తరగతిలో చేరుతున్నారు. 10వ తరగతి విద్యా ప్రమాణాలు పెంపొందించుకుంటున్నారు. కస్తూర్బా పాఠశాలలో ఇంటర్మీడియేట్ విద్యను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో పాఠశాలలో చేరికలు పెరిగిపోయాయి. ఫలితంగా తరగతి గదులు తక్కువ రావడంతో నాడు- నేడు కింద కస్తూర్బా జూనియర్ కళాశాలకు భవనాలు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో నాడు- నేడు కింద మంజూరైన కస్తూర్బా జూనియర్ కళాశాల భవన నిర్మాణాలకు ప్రతి పాదనలు, ఆర్భాటాలు తప్ప తగినన్ని నిధులు కేటా యించకపోవడంతో సదరు కాంట్రాక్టర్లు అర్ధంతరంగా పనులు ఆపేశారు. అంతేకాకుండా పనులపై పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపంతో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి అసౌకర్యాల నడుమ విద్యార్థినులు విద్యను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధించిన జిల్లా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టి విద్యార్థినులకు తగిన సౌకర్యాలు కల్పించి వారి విద్యా ప్రమాణాలను పెంపొం దించేందుకు కృషి చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. భవ నాలు పూర్తి అయితే అన్ని సదుపాయాలు, తమ పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం



తమ పాఠశాలలో సరైన వసతులు లేక ఇబ్బంది లు పడుతున్నాం. తాగడానికి నీరు కూడా సక్రమంగా అందడం లేదు. ఉన్న బోరులో నీరు అడు గంటిపోయాయి. బయట నుంచి క్యాన్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. మాకు సకాలంలో సరైన వసతులు కల్పిస్తే విద్యా ప్రమాణాలు పెంపొందించుకుంటాం.

నాగలక్ష్మి, జూనియర్ ఇంటర్

భవనాలు పూర్తి చేయండి



నాడు- నేడు కింద తమ పాఠశాలకు అదనంగా ఇంటర్మీడియట్ భవనాలు మంజూరయ్యాయి. అవి నిధులు లేక అర్ధాంతరంగా ఆగిపోయాయి. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి తమ విద్యాభివృద్ధికి సహకరించాలి.

దీపిక, జూనియర్ ఇంటర్

బైక్, ట్రాక్టర్ ఢీ - ఇద్దరికి తీవ్రగాయాలు

అడ్డు, అదుపులేకుండా అక్రమంగా బోల్డర్స్ తరలింపు ● ఘటన తరువాత ట్రాక్టర్‌లో బోల్డర్స్ మాయం



ఘటనా స్థలంలో ట్రాక్టర్ కింద పడిన వ్యక్తి

ముద్దనూరు నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్లలో అక్రమ బోల్డర్స్ తరలింపు అడ్డూ అదుపులేకుండా పోయింది. కొండ ప్రాంతంలోని భూముల నుంచి బోల్డర్స్ తరలిస్తున్నారు. ట్రాక్టర్ల వేగానికి అదుపులేకుండా పోతోంది. గురువారం జమ్మలమడుగు రోడ్డులోని ప్రభుత్వ ఇళ్ల లేఔట్ సమీపంలో బోల్డర్స్ తరలిస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో ఒకరికి రెండు చేతులకు గాయాలు, ఛాతికి తీవ్రగాయమైంది. మరొకరు బైకు నుంచి కింద పడడంతో తల వెనుక తీవ్రగాయమైంది. అయితే ట్రాక్టర్‌లో బోల్డర్స్ ఉంటే కేసు అవుతుందని ట్రాక్టర్ యజమాని గ్రహించినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను మరో చోటి తీసుకెళ్లి బోల్డర్స్ అన్‌లోడు చేసి ఎంతో చాకచక్యంగా ఖాళీ ట్రాక్టర్‌ను ప్రమాద స్థలంలో నిలిపారు. ఇంత జరుగుతున్నా పోలీసుల తీరుపై పలు విమర్శలు వినిపిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు వివరాల్లోకెళితే....

కొండాపురం మండలం ఓబన్నపేట వాసులు సురేంద్రారెడ్డి, బాబు బైక్‌లో జమ్మలమడుగుకు వెళుతున్నారు. ప్రభుత్వ ఇళ్ల లేఔట్ సమీపం నుంచి ముద్దనూరుకు చెందిన ట్రాక్టర్ మట్టి రోడ్డు గుండా కొండ ప్రాంతం నుంచి బోల్డర్స్ తీసుకుని వస్తోంది. జామాయిల్ చెట్ల ప్రాంతంలో మెయిన్ రోడ్డు పైకి ట్రాక్టర్‌ను అతి వేగంగా తిప్పాడు. ఉన్నఫళంగా ట్రాక్టర్ రోడ్డుపైకి రావడంతో ముద్దనూరు వైపు నుంచి వస్తున్న బైక్ పైకి రావడంతో ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీ మధ్యలో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైకు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. సురేంద్రారెడ్డి తలకు హెల్మెట్ పెట్టుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. రెండు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ఛాతీకి తీవ్రగాయమైంది. బైకులో వెనుక కూర్చున్న బాబుకు తల వెనుక తీవ్రగాయమైంది. వెంటనే 108లో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్క డ వైద్యం అందించి కడపలోని ఓ ప్రైవేటు అస్పత్రికి తరలించినట్లు సమాచారం.

అదుపు లేకుండా బోల్డర్స్ తరలింపు

ట్రాక్టర్ల యజమానులు అడ్డు, అదుపు లేకుండా అక్రమంగా బోల్డర్స్ తరలిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండ ప్రాంతం నుంచి పునాదుల కోసం కొండ రాళ్లను తరలిస్తున్నారు. ట్రాక్టర్లు అతివేగంగా వస్తుంటాయి. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించకుండా వస్తుండడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నదానికి ఇదే నిదర్శనమని ప్రజలు అంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

బోల్డర్స్ తోలుకునేందుకు రెవెన్యూ పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. రెవెన్యూ సిబ్బందిని పంపి పరిశీలిస్తాం. కొండ ప్రాంతంలో కొందరికి డీకేటీ పట్టాలు ఇచ్చారు. ఆ భూమిలో ఉన్న బోల్డర్స్‌ను కొందరు ట్రాక్టర్ యజమానులు తోలుకుంటున్నారు. భూమి సాగు పనులు చేస్తున్నారా అన్నదాని పూర్తి వివరాలు సేకరిస్తాం. తదుపరి తగుచర్యలు తీసుకుంటాం.

వరదకిశోర్‌రెడ్డి, తహసీల్దారు,ముద్దనూరు

అర్ధరాత్రి ఇసుక రీచ్‌ల తనిఖీ

రెండు టిప్పర్లు సీజ్ చేసిన ఆర్డీఓ

కొండాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుక రీచ్‌లను గురువారం అర్ధరాత్రి జమ్మలమడుగు ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీ తనిఖీ చేశారు. తిమ్మాపురం క్రాస్ వద్ద గురువారం ఒంటిగంటకు ఆర్డీఓ వాహనాలను సిబ్బందిచే తనిఖీ చేయించారు. ముందస్తు సమాచారంతో తెల్లవారుజామున ఆర్డీఓ అకస్మిక దాడులు నిర్వహించారు. బిల్లులు లేకుండా ఇసుకను తీసుకెళుతుండగా రెండు టిప్పర్లను సీజ్ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు నంద్యాల వైపు వెళుతున్న రెండు ఇసుక టిప్పర్లను సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప పాల్గొన్నారు.

నిందితులకు జైలు శిక్ష

బద్వేలుటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు ప్రేరేపితులు, ఆంజనేయనగర్ వాసులు భూమిరెడ్డి శివారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డికి మూడేళ్ల జైలు, రూ.1000 జరిమానా కోర్టు విధించింది. వివరాల్లోకెళితే....

2014లో భూమిరెడ్డి రామసుబ్బారెడ్డిని మోసంచేసి, బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించడంతో అతను చనిపోయాడు. ఈమేరకు నిందితులు భూమిరెడ్డి శివారెడ్డి, భూమిరెడ్డి శాంతమ్మ, భూమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, భూమిరెడ్డి ఇంద్రసేనారెడ్డిపై కేసు నమోదు చేశారు. విచారణ సమయంలో భూమిరెడ్డి శాంతమ్మ, భూమిరెడ్డి ఇంద్రసేనారెడ్డి మరణించడంతో మొదటి నిందితుడు భూమిరెడ్డి శివారెడ్డికి, మూడో నిందితుడు భూమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డిలకు శిక్షను ఖరారు చేశారు. పదేళ్ల కిందటి కేసులో నేడు కోర్టు శిక్షను తీర్మానించింది.

మహిళ అదృశ్యం

కడప(క్రైం)నవంబరు14(ఆంధ్రజ్యోతి): కడప నగరం వైఎస్ఆర్ కాలనీకి చెందిన మహిళ అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్ రెడ్డి తెలిపారు. సత్యసాయి జిల్లాకు చెందిన రాగుల వెంకట రమణ జీవనోపాధి నిమిత్తం వైఎస్ఆర్ కాలనీలో ఉంటున్నాడు. జీపు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. భార్య రాగుల వైశాలి ఇంటివద్దే ఉంటోంది. 13న వైశాలి ఇంటి నుంచి వెళ్ళినట్లు తెలిపా రు. భర్త ఫిర్యాదుపై కేసును నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

కడప(క్రైం)నవంబరు14(ఆంధ్రజ్యోతి): కడప నగరం మరియాపురం మహిళను బెదిరించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అయన వివరాల మేరకు రాజరెడ్డి వీధికి చెందిన సుజీత్ అలియాస్ బన్ని డబ్బు విషయమై మహిళను గురువారం బెదిరించారని బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గండి గురుకుల పాఠశాలలో రాష్ట్ర క్రీడలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న కర్నూలు గురుకుల పాఠశాలల సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి

చక్రాయపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గండి గురుకుల పాఠశాలలో గురువారం రాష్ట్రస్థాయి జోన్-4 క్రీడలు ప్రారంభమయ్యాయి. కర్నూలు గురుకుల పాఠశాలల సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి కాగడాను వెలిగించి క్రీడలను ప్రారంభించారు. రాష్ట్రంలో దాదాపు 21 గురుకుల పాఠశాలల నుంచి 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడు రోజులు క్రీడలు జరగనున్నాయి. కార్యక్రమంలో చిత్తూరు గురుకుల పాఠశాల సమన్వయకర్త పద్మజ, జూనియర్ కళాశాల ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్య, మాజీ స్పోర్ట్స్ అథారిటీ రామచంద్రారెడ్డి, జోన్-4 క్రీడలు సమన్వయకర్త నీలకంఠేశ్వరరావు, ఆర్గనైజర్ కె.ఎల్లారెడ్డి, ఎంపీటీసీ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సహకార పరపతి సంఘాలను బలోపేతం చేయాలి

కడప రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార పరపతి సంఘాలను మరింతగా బలోపేతం చేయాలని డీసీసీ బ్యాంకు ఇన్‌చార్జ్ సీఈఓ రాజామణి పేర్కొన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ కంప్యూటరైజేషన్ ద్వారా వ్యవసాయ సహకార పరపతి సంఘాలను పటిష్టం చేయాలన్నారు. బ్యాంకు సేవలను మరింత సులభతరం చేస్తున్నామని, అన్ని వర్గాల వారికి విరివిగా రుణాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సుభాషిణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన జయంత్యుత్సవాలు

బ్రహ్మంగారిమఠం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన కర్త పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి 416వ జయంతి మహోత్సవాలు నవంబరు 12 ప్రారంభమై 14న మహా ప్రసాద వినియోగంతో వైభవంగా ముగిసినట్లు ఆలయ ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. గురువారం ఉదయం సుప్రభాతం, పారాయణం, వీరబ్రహ్మేంద్రస్వామికి విశేష హోమాలు, మండల పూజ, శాంతి హోమం. పూర్ణాహుతి చేపట్టారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

కార్తీక సహస్ర దీపార్చన

బ్రహ్మంగారి ఆలయ ప్రాంగణలో సాయంత్రం 6గంటలకు భక్తిశ్రద్ధలతో పూర్వపు మఠాధిపతి కుటుంబసభ్యులు, భక్తులు కార్తీక సహస్ర దీపార్చన చేశారు. కార్యక్రమంలో ఉభయదాతలు ఇడమకంటి జనార్ధన శివాచార్య కుటుంబ సభ్యులు పూర్వపు మఠాధిపతుల కుటుంబ సభ్యులు, ఫిట్‌పర్సన్ శంకర్ బాలాజీ మేనేజరు ఈశ్వరాచారి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన చెరుకూరి రవికుమార్



సీఎంతో కలిసిన టీడీపీ నేత రవికుమార్

పోరుమామిళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును బద్వేలు టీడీపీ యువనేత చెరుకూరి రవికుమార్ కలిశారు. గురువారం సచివాలయంలోని ఛాంబరులో కలిసి పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తాను చేసిన సేవలు గుర్తించమని ముఖ్యమంత్రికి తెలిపి తనకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందిం చినట్లు తెలిసింది.

'హైందవ శంఖారావం' విజయవంతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి

సింహాద్రిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) విశ్వహిందూ పరిషత్-ఏపీ ఆధ్వర్యంలో 2025 జనవరి 5న విజయవాడలో జరిగే బహిరంగ సభకు హిందూ బంధువులు లక్షలాదిమంది సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, ఆరెస్సెస్ విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్‌జీ పిలుపునిచ్చారు. వేణుగోపాలస్వామి ఆలయంలో హైందవ శంఖారావం సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తం చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టసవరణ చేయాలని వీహెచ్‌పీ ఒక జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. చట్టసవరణ చేయాలని కోరుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల గవర్నర్లకు సెప్టెంబరు 30న మెమొరాండం ఇచ్చామన్నారు.

- లబ్ధిదారుల ముఖ హాజరుతో తిప్పలు
- మారుమూల ప్రాంతాల్లో నెట్ వర్క్ కష్టాలు
- ఓ వైపు రికార్డులు, మరో వైపు

సమావేశాలతో ఉక్కిరి బిక్కిరవుతున్న వైనం

అంగన్వాడీలకు యాప్ కష్టాలు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కార్యకర్తలు యాప్‌లతో సతమతవుతున్నారు. లబ్ధిదారులకు పోషణ ట్రాకర్, బాల సంజీవిని అందించాలంటే నాలుగు యాప్‌లు నిర్వహించాలి. ఇందుకు ముఖ హాజరు నమోదు చేయాలంటే పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం బాలసంజీవిని ద్వారా లబ్ధిదారులకు ముఖ గుర్తింపుతో బియ్యం ఇస్తున్నారు. అయితే ఇప్పుడు తాజాగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ ద్వారా యాప్‌లో లబ్ధిదారులకు ముఖ గుర్తింపు ద్వారానే ఇవ్వాలనే నిబంధనను తప్పని సరి చేయడంతో కార్యకర్తలు రెండు యాప్‌లు నిర్వహించాలంటే కష్టతరంగా మారిందని వాపోతున్నారు. కనీసం అంగన్వాడీ కార్యకర్తలకు యాప్‌లపై అనుభవం ఉన్న వారిచే శిక్షణ ఇప్పిస్తే కొంచమైనా అనుభవం వస్తుందంటున్నారు. ఆయా అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు 6 నెలల నుంచి 3 సంవత్సరాల బాలలకు ఆయా కేంద్రాల్లో ప్రతి నెల పోషకాహారాన్ని లబ్ధిదారుల ఇంటికే అందించడం జరుగుతుంది. గతంలో లబ్ధిదారులకు అంగన్వాడీ కేంద్రాల వద్దనే ఇచ్చేవారు. అయితే ఎక్కువ మంది తమకు ఇంటి వద్దకే కావాలంటూ ప్రభుత్వానికి అభ్యర్థనలు రావడంతో దాన్ని టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్)గా మార్చి పాలు, కోడి గుడ్లు, నూనె, పప్పుదినుసులు, బియ్యం వంటివి ప్రతి నెలా రెండు దఫాలుగా అందిస్తున్నారు. బి.కొత్తకోట సెక్టార్ పరిధిలోని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, కందుకూరు, ములకలచెరువు మండలాల్లో 165 మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి, ఇందులో 56 మినీ ఉపకేంద్రాలు ఉన్నాయి. కాగా ప్రీ స్కూల్ పిల్లలు 1889 మంది ఉండగా గర్భిణులు, బాలింతలు 1455 మంది 6నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు4128 మంది ఉన్నారు. వారందరికి ప్రతి నెల వివరాలు యాప్‌లో నమోదు చేయాల్సి రావడంతో పూర్వ ప్రాథమిక విద్యకు ఇబ్బందిగా మారిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు సార్లు నమోదు కష్టంగా మారింది

ఆయా కేంద్రాల్లో ఉన్న గర్భిణీలు, బాలింతలు 6 నెలల నుంచి 3 సంవత్సరాలు కలిగిన చిన్నారుల పూర్తి వివరాలను పోషణ యాప్ ద్వారా రెండు సార్లు నమోదు చేయాల్సి వస్తోందంటున్నారు. అదే విధంగా టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) అందించాలంటే ఒకే వ్యక్తికి తప్పకుండా రెండు సార్లు ముఖ యాప్ ద్వారా అంగన్వాడీ కార్యకర్తలకు ఇబ్బందికరంగా మారిందంటున్నారు.

ప్రాథమిక విద్యకు ఇబ్బందులు

అంగన్వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 15 రకాల రికార్డులను నమోదు చేయాల్సి ఉందని దీంతో ప్రాథమిక విద్యకు ఇబ్బందులు కలుగుతున్నాయని అంగన్వాడీలు వాపోతున్నారు. ఇంఉదలో లబ్ధిదారులకు అందించే ఆహారం వినియోగం (ఎఫ్‌సీఆర్), పిల్లలు, గర్భిణులు,బాలింతలకు నమోదు చేసే రికార్డులు (ఎస్.ఎస్.టి), ప్రీ స్కూల్ అడ్మిన్ రికార్డులను ప్రతి నిత్యం విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. వాటితో పాటుగా పిల్లలకు అందించే టీకాలకు సంబంధించిన రికార్డుల రిజిస్టర్, విటమిన్-ఏ రికార్డు, రెఫరల్ సర్వీసెస్ గృహ సందర్శకుల రికార్డులను చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు నెలవారీ ప్రాజెక్టు (ఎంటీఆర్), ఆయా అంగన్‌వాడీల పరిధిలోని హోస్ హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డు, గ్రోత్ చార్ట్‌లతో పాటుగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబందిం చిన రెండు టేక్ హోమ్ రేషన్‌ల రికార్డు, స్టాఫ్ అడ్మిన్ రిజిస్టర్ నిర్వహించాల్సి వస్తోందంటున్నారు.


పోషణ యాప్ ద్వారా తీసిన లబ్ధిదారుల ఫొటో

నెట్ వర్క్‌రాని ప్రాంతాల్లో మరీ ఇబ్బంది

మండలంలోని మారుమూల ప్రాంతాలైన టి.సదుం పంచాయతీ గుంటిపల్లె, నవాబుకోట పంచాయతీ గుగ్గిళ్లపల్లె, బెట్టకొండ, కందుకూరు పంచాయతీ గొల్లపల్లె , గొడుగువారిపల్లె, నిలువు రాతిపల్లె పంచాయతీల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో నెట్ వర్క్ కష్టాలు అధికంగా ఉండడంతో కార్యకర్తలు సమీపంలో గల సచివాలయాల వద్దకు వెళ్లి వైఫై ద్వారా కనెక్ట్ చేసుకుని మరీ లబ్ధిదారుల నమోదు చేస్తున్నారు.

యాప్‌ల భారం తగ్గించాలి

అంగన్వాడీలకు ప్రభుత్వం స్పందించి యాప్‌ల భారం తగ్గించాలని పలువురు కోరుతున్నారు. ఆయా గ్రామాల్లోని క్షేత్ర స్థాయిలో ఏ కార్యక్రమాలను ప్రభుత్వం తల పెట్టినా మొదటగా అంగన్వాడీ కార్యకర్తలను భాగస్వాములను చేస్తున్నారని వాపోతున్నారు. తల్లి గర్భం దాల్చిన సమయం నుండి బిడ్డ పుట్టి ఆరేళ్ల వయస్సు వచ్చే వరకు అంగన్వాడీ కార్యకర్తలే వారిని నిత్యం పర్యవేక్షించాల్సి వస్తోందన్నారు. తల్లికి, బిడ్డకు పోషణతో పాటు బిడ్డలకు టీకాలు, వారి ఆరోగ్య కార్డులు తదితర వివరాలను నిత్యం అంగన్వాడీ కార్యకర్తలే నిత్యం యాప్‌ల ద్వారానే నిర్వహించాల్సి వస్తోందని వాపోతున్నారు.


చిత్రం చెప్పిన సమస్య

ములకలచెరువు, చిటిమిరెడ్డిగారిపల్లె, సోంపల్లెక్రాస్ తదితరచోట్ల విద్యుత్ స్తంభాలకు తీగలు అలుముకు న్నాయి. ఈ స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-ములకలచెరువు, (ఆంధ్రజ్యోతి)

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవరుచుకోవాలి


శిబిరంలో పాల్గొన్న జనసేన, టీడీపీ నేతలు సాయినాథ్, పాలగిరి సిద్ధా

ములకలచెరువు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవరుచుకోవాలని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పేర్కొన్నారు. ములకలచెరువులో గురువారం జనసేన ఇన్‌చార్జి, మదనపల్లె అగర్వాల్‌దృష్టి హాస్పటల్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు వంశీధర్‌రెడ్డి, అబిలాస్, రాజశేఖర్, ఇమాన్యుల్‌లు 100 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే పలువురిని ఆపరేషన్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నాయీ బ్రాహ్మణ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతకుంట్ల కేశవులు, నాయకులు ఉమా శంకర్, సుధాకర్‌నాయుడు, ప్రతాప్, భాస్కర్‌నాయుడు, రమణప్ప, జనసేన నాయకులు షోరూం నూరి, సుదర్శన్, కోటిరెడ్డి, శంకర, పవన్‌రెడ్డి, సుబ్బు, అంజి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పని చేసే స్వీపర్లకు జీతాలు చెల్లించాలి

పెద్దతిప్పసముద్రం నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిద ప్రభుత్వ ఉన్నత, పాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆమేరకు కుక్కలపల్లె, పులికల్లు, కాట్నగల్లు, తుమ్మరకుంట, రంగసముద్రం, టి.సదుం గ్రామాలకు చెందిన స్వీపర్లు మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 6 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తక్షణం మాకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలంటూ కోరారు. వెంటనే ప్రభుత్వం బకాయిలను విడుదల చేసి తమను ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో గౌరమ్మ, లక్ష్మీదేవి, అరుణమ్మ, వేమనారాయణమ్మ, నరసమ్మ, సావిత్రమ్మ, గాయత్రి, గంగరత్న పాల్గొన్నారు.

పంటల బీమాపై వ్యవసాయ అధికారులకు శిక్షణ

వాల్మీకిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, సిబ్బందికి గురువారం పంటల బీమాపై శిక్షణా ఇచ్చారు. ఈసందర్భంగా జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు ముజీబ్‌అహ్మద్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే వరి, వేరుశనగ, టమోటా పంటల బీమా పీఎంఎఫ్‌బీఐ ద్వారా వరి పంటకు ఎకరాకు రూ.126 ప్రీమియం డిసెంబరు 31లోగా చెల్లించేలా చూడాలన్నారు. అలాగే వేరుశనగ పంటకు ఎకరాకు రూ.96, టమోటా పంటకు ఎకరాకు రూ.1600 డిసెంబరు 15లోపు రైతులు ప్రీమియం చెల్లించే విధంగా చూడాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏడీఏ వాణిశ్రీ, ఏవోలు హేమలత, రమేష్‌రాజు, వెంకటమోహన్, రామకృష్ణరాజు, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకురండి


కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో తదితరులు

గుర్రంకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):డంపింగ్ యార్డులను పంచాయతీ సిబ్బంది వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. గుర్రంకొండ సచివాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో నిరుపయోగకరంగా ఉన్న డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకొచ్చేలా కార్యదర్శులు పని చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం గుర్రంకొండలో డంపింగ్ యార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశులు, ఈవోఆర్డీ బ్రహ్మానందరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి


ఉపాధి సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం

గుర్రంకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, పండ్లతోటల పెంపకం, ఇంకుడు గుంతల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. కూలీలు పనులకు వచ్చేలా సిబ్బంది పనులపై అవగాహన కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు రైతులకు అవసరమైన పనులను గుర్తించి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశులు, ఏపీవో జయరామిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు మదనపల్లెలో అంబళంపూజ

మదనపల్లె అర్బన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో శుక్రవారం (15న) అంబళంపూజ, పడిపూజ, నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురుస్వాములు శ్రీకాంత్, బాబు, మురళి, శ్రీనివాసలు, కరాటే రమణ, చంద్రమౌళి పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా వైభవంగా ఇక్కడ అంబళం పూజ, పడిపూజ నిర్వహిస్తున్నామన్నారు. అయ్యప్పమాలదారులు, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

19న ఐటీఐలో జాబ్ మేళా

తంబళ్లపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 19న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపి స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా ఉపాధి, సీడప్ ఆధ్వర్యంలో 19న ఉదయం 10 గంటలకు తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ చౌడయ్య ఫోన్ నెం:9618655759లో సంప్రదించాలని కోరారు.

పాతకక్షలతో వ్యక్తి పై కత్తిపోటు


కత్తిపోటుకు గురైన వీరాస్వామి

బి.కొత్తకోట, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): పాతకక్షలతో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్య చేయబోయిన సంఘటన బి.కొత్తకోట మండలంలోని గోళ్లపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన యానాది వీరాస్వామి(44) సిమెంటు పనికి దినసరి కూలీగా వెళుతున్నా డు. గురువారం యథావిధిగా పనిలో ఉండగా అదే గ్రామానికి చెందిన భగవాన్(38)అనే వ్యక్తి అక్కడికి చేరుకొని తనతో రావాలని పిలిచాడు. పోవడానికి వీరాస్వామి నిరాకరించడంతో గొడవకు దిగి తనతో పాటు తెచ్చుకున్న కూరగాయలు కోసే కత్తితో వీరాస్వామిని పొడిచాడు. అది పూర్తిగా శరీరంలోకి దిగి పోయింది. దీంతో అతను ప్రాణభయంతో గావు కేకలు పెట్టడంతో భగవాన్ అక్కడినుంచి పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అం దించడంతో సీఐ రాజారెడ్డి ఆదేశాలతో సిబ్బంది వీరాస్వామిని 108లో మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుని స్టేట్‌మెంటును రికార్డు చేసి, కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె మండలం సాకిబండారువారిపల్లెకు చెందిన తిమ్మరాయప్ప (60) అనారోగ్య కారణంగా ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా మెరుగైన వైద్యం కోసం ఆయనను తిరుపతికి రెఫర్ చేశారు.

ద్విచక్రవాహనాలు ఢీ ఒకరికి తీవ్ర గాయాలు

ములకలచెరువు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో శ్రీనివాసులురెడ్డి (45)అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు...శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం ఎర్రబల్లికి చెందిన శ్రీనివాసులురెడ్డి సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులురెడ్డి తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అలాగే తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌కు చెందిన మరో ద్విచక్రవాహనదారుడు స్వల్పంగా గాయపడ్డాడు.

వరకట్న వేధింపులు.. నలుగురిపై కేసు నమోదు

ములకలచెరువు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరకట్నం కోసం వేధించడంతో పాటు తన భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై నలుగురు అత్తింటివారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ములకలచెరువులోని పీటీఎం రోడ్డుకు చెందిన షబ్రీన్‌కు శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన మహబూబ్‌బాషాతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన వారం రోజుల నుంచే భర్త, అత్త బీబీ, అతడి అక్కా బావలు తాజిఖ్, బావాజాన్‌లు వరకట్నం కోసం మానసికంగా హింసించి రెండుసార్లు హత్యాయత్నం చేశారని తెలిపింది. వరకట్నం కోసం తనను తన బిడ్డను ఇంట్లో నుంచి తరిమేసి విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్నాడని షబ్రీన్ ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై భర్త, అత్త, ఆడపడుచు, ఆమె భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గాయత్రి తెలిపారు.

పిడుగుపాటుకు రెండు పాడి ఆవుల మృతి

పీలేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం తిమ్మాపురం వద్ద గురువారం పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు మృతి చెందాయి. తిమ్మాపురం పంచాయతీ ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన ఉప్పుతోళ్ల మోహన ప్రతిరోజూ లాగే గురువారం కూడా తన పాడి ఆవులను సమీపంలోని చెరువు వద్దకు మేతకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం ఒక్కసారిగా పిడుగు పడడంతో దాని ధాటికి మోహనకు చెందిన రెండు పాడి ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కొక్క ఆవు రూ.60 వేలు విలువజేస్తుందని, తమ కుటుంబానికి జీవనాధారంగా ఉన్న పాడి ఆవులు కోల్పోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు. పాడి ఆవులు మృతి చెందిన సమాచారం అందుకున్న తిమ్మాపురం, మహల్‌రాచపల్లె సచివాలయాల సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

ఘనంగా బాలల దినోత్సవం


బాలలదినోత్సవంలో పాల్గొన్న కరాటే విద్యార్థులు

మదనపల్లె అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కరాటే క్లబ్ కార్యాలయంలో గురువారం బాలల దినోత్సవాన్ని మదనపల్లె యూత్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కరాటే మాస్టర్ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు నెహ్రూ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు పాల్గొన్నారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎమ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికేట్లు, మెడల్స్ అందజేశారు. చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలోని ముత్తు ఇంగ్లీష్‌మీడియం స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

ఘనంగా సహకార వారోత్సవాలు


సహకార జెండా ఎగుర వేసి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక సహకార కార్యాలయంలో గురువారం 71వ అఖిల భారత సహ కార వారోత్సవాలను సీఈవో హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా కార్యాలయం ఎదుట సహకార జండాను ఎగుర వేసి ప్రతిజ్ఞ చేశా రు. సీఈవో మాట్లాడుతూ ఈనెల 20 వరకు సహకార ఉద్యమ ప్రగతికి అత్యంత ప్రాధ్యాన్యత నిస్తూ గత 70ఏళ్లగా అఖిల భారత సహకార దినోత్సవాలను జరుపు కొంటున్నామని తెలిపారు. ఈ ఏడాది 71వ సంవ త్సరంలో అడుగు పెట్టినట్లు తెలిపారు. అనంతరం రైతులకు మిఠాయి లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పర్సన్‌ఇన్‌ఛార్జి రఘునాథరెడ్డి, సిబ్బంది వేణు, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం


గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న విజయకుమార్


కలికిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. జేఎన్టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథాలయాధికారి ఎన్.జఫ్రున్నీసా ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యోగులు, పలువురు శాఖాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక శాఖా గంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థుల సమక్షంలో గ్రంథాలయాధికారి విజయకుమార్ ప్రారంభించారు. శుక్రవారం నుంచి అనేక రకాల కార్యక్రమాలను రోజువారీ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ


పీలేరులో క్యాన్సర్ పరీక్షల శిబిరాన్ని పరిశీలిస్తున్న శివప్రతాప్

పీలేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముందస్తు ఆరోగ్య పరీక్షలతో ప్రాణాంతకమైన క్యాన్సర్ బారి నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా రాష్ట్రీయ బాల్ స్వస్థ కార్యక్రమ్(ఆర్‌బీఎస్‌కే), ఎన్‌సీడీ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ శివప్రతాప్ పేర్కొన్నారు. ఎన్‌సీడీ 3.0 పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఆరోగ్య సర్వేలో భాగంగా చేస్తున్న క్యాన్సర్ పరీక్షలను గురువారం ఆయన పీలేరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ఇంటి వద్దకు వచ్చి ఆరోగ్య స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించే ఆరోగ్య సిబ్బందికి సహకరించి పరీక్షలు చేయించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతర్గతంగా దాగి ఉన్న వివిధ ఆరోగ్య సమస్యల నిర్ధారణతోపాటు క్యాన్సర్లు, డయాబెటిస్, బీపీ వంటి రుగ్మతల గురించి ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పిస్తారని ఆయన వివరించారు. కార్యక్రమంలో తలపుల పీహెచ్‌సీ అధికారి చంద్రశేఖర్ నాయక్, హెచ్‌ఈ కొండయ్య, సూపర్‌వైజర్ కుసుమ, ఏఎన్‌ఎంలు భార్గవి, రేణుక, సీహెచ్‌వోలు చంద్రకళ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అనాథ శరణాలయానికి చేయూత


అనాథ శరణాలయానికి వితరణ చేస్తున్న విద్యార్థులు

కురబలకోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కదిరిలోని సేవా భారతి అనాథ శరణాలయానికి చేయూతనందించారు. కళాశాల మిట్స్ సోషల్ రెస్పాన్సిబుల్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి అనాథ శరణాలయానికి రూ.25 వేలు విలువ చేసే సోలార్ లైట్లు, ప్రొజెక్టర్ స్ర్కీన్, ప్యాన్లు, దుప్పట్లు తదితర సామగ్రిని అందజేశారు. అనాథ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని అందజేశారు. కోఆర్డినేటర్ షాహిద్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులకు తమ వంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు.

గృహనిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించండి


ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి

పెద్దతిప్పసముద్రం నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న గృహనిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో చేప డుతున్న గృహనిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసేందుకు ఆయా గ్రామాల్లో ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులతో మాట్లాడి పనులను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు వచ్చి పనులను పూర్తి చేయించాలన్నారు. పనులను పూర్తి చేస్తే తక్షణం బిల్లులు మంజూరు చేసేందుకు తమ కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాసులుతో పాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ... అడ్డుకున్న వీఆర్‌వో


బొమ్మనచెరువు హౌసింగ్‌కాలనీ వద్ద ప్రభుత్వ స్థలాన్ని చదును చేసిన దృశ్యం

మదనపల్లె టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం బొమ్మనచెరువు పంచాయతీ హౌసింగ్‌కాలని వద్ద ఓ వ్యక్తి కమ్యూనిటీ స్థలాన్ని చదును చేసి ఆక్రమించుకుంటుండగా వీఆర్‌వో అడ్డుకున్నారు. గురువారం ఉదయం హౌసింగ్‌కాలనీ వద్ద ఉన్న సెల్‌ఫోన్ టవర్ కింద పంచాయతీ కోసం వదలిన కమ్యూనిటీ స్థలాన్ని సందిరెడ్డిగారిపల్లెకు చెందిన ఓ వ్యక్తి ఎక్సవేటర్ పెట్టి చదును చేయిస్తున్నాడు. రహదారి పక్కనే ఈ స్థలం ఉండటంతో అటుగా వస్తున్న ప్రజలు బొమ్మనచెరువు వీఆర్‌వో సౌజన్యకు సమాచారం అందించారు. దీంతో వీఆర్‌వో సౌజన్య అక్కడికి చేరుకుని అది ప్రభుత్వ స్థలమని, అక్కడ ఎలాంటి చదును చేయకూడదని హెచ్చరించారు. మళ్లీ వచ్చి రాత్రిళ్లు చదును చేస్తే ఎక్సవేటర్‌ను సీజ్ చేసి పోలీసు కేసు పెడతామన్నారు.

అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యేపై ఆరోపణలు తగదు

మదనపల్లె టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషాపై కొందరు గిట్టని వారు ఆరోపణలు చేయడం తగదని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక విలేకర్ల సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్ మాట్లాడుతూ 150 రోజుల కూటమి పాలనలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో బీజేపీ నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేశారు. జనసేన నాయకుడు శ్రీరామరామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో ఏ నియోజకవర్గానికి మంజూరు కానన్ని నిధులను ఎమ్మెల్యే మదనపల్లెకు మంజూరు చేసుకొచ్చి అభివృద్ధి పనులు చేయి స్తున్నారన్నారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్ మాట్లాడుతూ పట్టణంలో సీటీఎం రోడ్డులో చింతచెట్లను తొలగించి, రోడ్డును విస్తరించే పనిని ధైర్యంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేయించారని, దీన్ని తట్టుకోలేక వైసీపీ సైకో బ్యాచ్ దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు గుర్రప్పనాయుడు, మాజీ ఎంపీపీలు జీకే వెంకటరమణ, రెడ్డెప్పరెడ్డి, బాలుస్వామి, జేవీ రమణ, హిమగిరి, షంషీర్, సహదేవ, నాదెళ్ల శివన్న, సుధాకర్, చల్లా నరసింహులు, సాకే కృష్ణమూర్తి, కత్తి లక్ష్మన్న, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రామసముద్రంలో:అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొందరు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాపై నిందారోపణలు చేస్తున్నారని రామసముద్రం టీడీపీ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడు ధ్వజమెత్తారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.

యుద్ధప్రాతిపదికన గోకులాల నిర్మాణం చేపట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో శివశంకర్

పీలేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన గోకులాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని పీలేరు ఎంపీడీవో శివశంకర్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం పీలేరు వెలుగు కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు మండలానికి ప్రభుత్వం 53 గోకులాలను మంజూరు చేసిందని, వాటిని లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామన్నారు. ఆరు ఆవుల సంరక్షణ కోసం రూ.2.30 లక్షల వ్యయంతో గోకులాలను నిర్మించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో మహేశ్, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

సర్వే రాళ్లపై జగన్ పేరు తొలగింపునకు శ్రీకారం


సర్వే రాళ్లపై పేరును తొలగిస్తున్న కార్మికులు

బి.కొత్తకోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం భూముల రీసర్వే పేరుతో రాళ్లపై చెక్కించిన జగన్ పేరును కూటమి ప్రభుత్వం రాగానే తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బి.కొత్తకోట మండలంలో రీసర్వే పూర్తి అయిన గోళ్లపల్లె, తుమ్మణంగుట్ట, గోళ్లపల్లె, గుమ్మసముద్రం గ్రామాలలో ప్రత్యేకంగా కార్మికు లను రప్పించి గ్రైనింగ్ యంత్రాల సాయంతో రాళ్లపై పేరును తొలగిస్తున్నారు. పై నాలుగు గ్రామాలలో 7359 రాళ్లను నాటడంతోపాటు నిల్వ వుంచిన రాళ్లపై సైతం పేరును తొలగించే ప్రక్రియ యుద్ధప్రాతిపదికన జరుగుతోందని తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ గురువారం పేర్కొన్నారు. సర్వేయర్, ఆయా వీఆర్వోల పర్యవేక్షణలో ఇది జరుగుతోందన్నారు.